

# భారీ అగ్నిప్రమాదం

## - ఐదుగురు సజీవదహనం

జైపూర్ : రాజస్థాన్‌లో శుక్రవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం జరిగి ఐదుగురు సజీవదహనమయ్యారు. మరో 20 మంది గాయపడ్డారు. ఈరోజు ఉదయం రాజస్థాన్ రాజధాని జైపూర్‌లోని అజ్మీర్ రోడ్‌లో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద ఆపి ఉంచిన సీఎన్‌జీ ట్యాంకర్‌లో మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు ట్యాంకర్ నుంచి పక్కనే ఉన్న అన్ని వాహనాలకు వ్యాపించడంతో దాదాపు 40 వాహనాలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు సజీవదహనమయ్యారు.

2వ పేజీలో...



# భారత్‌కు ట్రంప్ బెదిరింపు!

ఢిల్లీ.: కాబోయే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలన ఎలా ఉండబోతోందో ఇప్పటికే ఒక అంచనా ఏర్పడింది. ఆయనలో బెధిరింపు దోరణి ఎక్కువగా కనిపిస్తోంది. అగ్రరాజ్య అధినేత అనే అహంకారం అది. తమ ఉత్పత్తులను దిగుమతి చేసుకొనే ఏ దేశమైనా వాటి మీద పన్నులు విధిస్తే తాము కూడా దెబ్బకు దెబ్బతీస్తామని అలాంటి దేశాలలో భారత్ కూడా ఉందని ట్రంప్ ఓపెన్‌గా చెప్పాడు.

2వ పేజీలో...



2వ పేజీలో...

అత్యాధునిక బాలిస్టిక్ క్షిపణి టెక్నాలజీ అభివృద్ధి చేస్తున్న

# పాకిస్థాన్..

## అమెరికా ఆందోళన

వాషింగ్టన్: పాకిస్థాన్ తీరుపై అమెరికా శ్వేత సౌధం ఆందోళన వ్యక్తం చేసింది. అత్యాధునిక క్షిపణి టెక్నాలజీని పాకిస్థాన్ డెవలప్ చేస్తున్నట్లు వైట్‌హౌజ్ సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు. సుదీర్ఘ దూరం ప్రయాణించే బాలిస్టిక్ క్షిపణులను కూడా పాక్ అభివృద్ధి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ టెక్నాలజీతో తమకు కూడా ప్రమాదకరంగా మారనున్నట్లు అమెరికా చెప్పింది.

భూభారతి బిల్లుకు

# శాసనసభ ఆమోదం

- వాడీవేడి చర్చ అనంతరం సభ తీర్మానం
- ధరణిపై సిబిఐ విచారణకు బిజెపి డిమాండ్
- ప్రతి సమస్యా భూమితో ముడిపడి ఉంది
- భూమికోసం ఎన్నో పోరాటాలు సాగాయి
- ప్రజల ఆత్మగౌరవం నిలబెట్టేది భూమి
- ధరణితో విదేశీ కంపెనీల చేతికి వివరాలు
- సభలో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- బిఆర్ఎస్ సభ్యుల తీరుపై ఆగ్రహం

**హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20 :** తెలంగాణ అసెంబ్లీలో భూభారతి బిల్లు - 2024 ఆమోదం పొందింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బిల్లును ప్రవేశపెట్టారు. భూ భారతి బిల్లు ప్రవేశ పెట్టే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. బిల్లు ఆమోదం పొందుతుండటంతో ఆనంద భాష్పాలు వస్తున్నాయన్నారు. సభలో భూ భారతి బిల్లు ప్రవేశ పెట్టిన మంత్రి..బిల్లును పాస్ చేయాల్సిందిగా స్పీకర్ ను కోరారు. సభ్యులు ఆమోదిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అనంతరం అసెంబ్లీని స్పీకర్ శనివారానికి వాయిదా వేశారు. భూభారతిపై చర్చ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రతి సమస్య భూమితోనే ముడిపడి ఉందని అన్నారు. తెలంగాణలో ప్రజల ఆత్మగౌరవం నిలబెట్టేది భూమి. భూమిని కాపాడుకునే ప్రయత్నంలో దొడ్డి కొమరయ్య వంటి వారు ప్రాణాలు కోల్పోయారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మల్లు స్వరాజ్యం లాంటి అనేక మంది భూ పోరాటాలు చేశారు. పేదల భూములు కాపాడేందుకు పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేశారు. భూమిలేని పేదలకు ఇందిరాగాంధీ ప్రభుత్వ భూమి ఇచ్చి ఆత్మగౌరవం నిలబెట్టింది.



2వ పేజీలో...



రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్‌ను ఖండించిన

# ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ : లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై దాఖలైన ఎఫ్ఐఆర్‌పై కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ మండిపడ్డారు. ఎఫ్ఐఆర్‌పై శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. దేశం మొత్తం చూస్తోందని, రాహుల్‌గాంధీపై ఇప్పటికే అనేక కేసులు పెట్టారు. అసత్యాలతో మరో కొత్త ఎఫ్ఐఆర్ తీసుకువచ్చారని అన్నారు. ఇది వారి నిస్సహాయ స్థితికి నిదర్శనమని అన్నారు. పార్లమెంటులో జరిగిన గొడవకు సంబంధించి ఢిల్లీ పోలీసులు గురువారం ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సంగతి తెలిసిందే. రాహుల్‌పై కేసు ప్రధాన అంశం నుండి దృష్టి మళ్లించడమేనని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ పేర్కొన్నారు. హోంమంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలను దారి మళ్లించే వ్యూహం తప్ప మరొకటి కాదని ఎక్స్‌లో పేర్కొన్నారు.

2వ పేజీలో...



2వ పేజీలో...

# భూభారతిపై చర్చించకుండా అడ్డు

- బిఆర్ఎస్ సభ్యుల తీరు దారుణం
- ప్రజలు బుద్ధి చెప్పినా మారని వైఖరి
- మండిపడ్డ మంత్రి పొంగులేటి

హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20: గతంలో చేసిన తప్పులను సరిదిద్దు కోకుండా భారాస సభ్యులు వక్రబుద్ధితో వ్యవహరిస్తున్నారని తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. శాసనసభలో భూ భారతి బిల్లుపై చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఫార్ములా ఈ-రేసు అంశంపై చర్చకు భారాస సభ్యులు పట్టుబట్టడంతో పాటు స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు యత్నించారు. ఈ క్రమంలో వారి ఆందోళనల మధ్యే భూ భారతి బిల్లుపై పొంగులేటి తన ప్రసంగాన్ని కొనసాగించారు. 'భారాస సభ్యులు భూ భారతి బిల్లును ఆమోదించకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు.



2వ పేజీలో...

- గత ప్రభుత్వం కన్నా రెట్టింపు స్థాయిలో కొనుగోళ్లు
- 93 శాతం మంది రైతులకు 24 గంటల్లోనే డబ్బులు జమ
- త్వరలో అందుబాటులోకి సైలోస్ సిస్టమ్
- ధాన్యం సేకరణ కేంద్రాల్లో ఆకస్మికంగా తనిఖీలు
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

# వేగంగా ధాన్యం సేకరణ

## రూ. 600 కోట్లు లూటీకే ఫార్ములా ఈ-రేస్ విచారణలో ఉన్నందున వివరాలు వెల్లడించలేను సభలో సిఎం రేవంత్ రెడ్డి వివరణ

**హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20:** ఈ-ఫార్ములా సంస్థతో జరిగిన కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం అంతా ప్రజల ముందు పెడతానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీలో కేటీఆర్ ఈ-ఫార్ములా కేసుపై సీఎం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ బీఏసీ మీటింగ్‌లో 9 అంశాలు ఇచ్చారు.. దీంట్లో ఈ ఫార్ములా గురించి ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఈ ఫార్ములా ప్రతినిధి తనను కలిశారని.. ఎవరు వచ్చినా అందరినీ కలుస్తానని చెప్పారు. ఈ ఫార్ములా ప్రతినిధిని తన ఇంట్లో కలిశానని అన్నారు. తనకేం సంబంధం అని అడిగానన్నారు. కేటీఆర్‌తో అంత సెటిల్ చేసుకున్నానని ఫార్ములా ప్రతినిధి అన్నారు.. అధికారులతో మాట్లాడి చెప్తా అన్నానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ-కార్ రేస్ ప్రతినిధి తనను కలవడంతోనే ఈ బండారం బయటపడిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఏసీబీ విచారణలో ఉన్నందున ఇప్పుడు పూర్తి వివరాలు చెప్పలేనని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఇక్కడ తానేం చెప్పినా కోర్టుకు వెళ్లి సీఎం తన మీద కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని కోర్టుకు చెప్పుకుందాం అనుకుంటున్నారని రేవంత్ రెడ్డి తెలిపారు.



# ఈ-ఫార్ములా సంస్థతో కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం

2వ పేజీలో...

2వ పేజీలో...

# కొత్త ఏడాదికి కమలానికి కొత్త అధ్యక్షుడు

**హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20 :** తెలంగాణ రాష్ట్ర బీజేపీకి కొత్త అధ్యక్షుడు ఎవరన్న దానిపై పార్టీ వర్గాల్లో నెలకొన్న ఉత్కంఠకు త్వరలోనే తెరపడనుంది. పార్టీ జాతీయ నాయకత్వం.. సంక్రాంతి కల్లా రాష్ట్రానికి అధ్యక్షుడిని నియమించనున్నట్లు తెలుస్తోంది. అయితే అంతర్గత చర్చల్లో రోజుకో సీనియర్ నేత పేరు తెరపైకి వస్తున్నా.. ఎంపీగా ఉన్న బీసీ నేతకు ఎక్కువ అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒకవేళ సమీకరణాలు మారితే మాత్రం అనూహ్యంగా కొత్త నేతకూ అవకాశం దక్కవచ్చని పార్టీ వర్గాలు అంటున్నాయి.

ప్రారంభించటమే కాదు, మన దేశం నుంచి చేసుకొనే దిగుమతులపై ప్రాధాన్యత వ్యవస్థ విధానం(జిఎస్‌పి)లో భాగంగా ఇస్తున్న రాయితీలను కూడా రద్దు చేసిన పెద్దమనిషి ట్రంప్. మనదేశాన్ని తమ వలలోకి లాక్కొనేందుకు అంతకు ముందు అమెరికా విసిరిన బిస్కెట్ వంటిది ఆ రాయితీ. ట్రంప్ చర్యకు ప్రతిగా మనం కూడా అమెరికా ఉత్పత్తులపై పన్ను విధింపుకు పూనుకున్నాం. వాటి మీద ప్రపంచ వాణిజ్య సంస్థలో పరస్పరం మూడేసి కేసులు దాఖలు చేశారు. వాటిని పరిష్కరించుకోవాలని కొద్ది నెలల క్రితం ఇరుదేశాలు ఒక అవగాహనకు వచ్చాయి. ఆ స్ఫూర్తిని దెబ్బతీసేందుకు ట్రంప్ పూనుకున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం అమెరికా నుంచి మనం చేసుకొనే దిగుమతుల కంటే మన ఎగుమతులే ఎక్కువగా ఉండి వాణిజ్య మిగులులో ఉన్నాం. దాన్ని పూడ్చేందుకు తమ వస్తువులను కొనుగోలు చేయాలని లేకుంటే వాణిజ్యపోరుకు దిగుతానని హెచ్చరించటమే ట్రంప్ మాటల అంతరార్ధం. పరస్పరం ఇచ్చిపుచ్చుకోవటమనే పదం ఎంతో ముఖ్యం. వారు ఒక సైకిలు కూరగాయలపై 132, రసాయనాలపై 56, కాఫీ, టీ, సుగంధ ద్రవ్యాలపై 53, చేపలు, వాటి ఉత్పత్తులపై 35శాతాల చొప్పున అమెరికా దిగుమతి పన్ను విధిస్తున్నది. దాని నిర్వాకం ఇలా ఉంటే ఇతర దేశాలపై ఎదురుదాడికి దిగుతోంది. జో బైడెన్‌తో మన దేశం కుదుర్చుకున్న అవగాహన ప్రకారం ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై పన్ను తగ్గి ఎగుమతి అవకాశాలు మెరుగుపడతాయని ఆ రంగాల వారు ఆశిస్తుండగా ట్రంప్ చేసిన తాజా ప్రకటనతో పరిస్థితి తిరిగి మొదటికి వస్తుందా? అన్న అనుమానం కలుగుతున్నది. అయితే మీ ఇల్లు మా ఇంటికి ఎంత దూరమో మాదీ అంతే అన్న లోకోక్తి తెలిసిందే. అమెరికా లేకపోతే పూట గడవదు అనే పరిస్థితి ఎవరికీ లేదు, అమెరికాతో సహా అన్ని దేశాలూ ఏదో ఒకదాని కోసం ఇతరుల మీద ఆధారపడాల్సినవే. జపాన్ సంస్థ నోమురా అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ముందు వెల్లడించిన నివేదికలో ట్రంప్ గెలిస్తే రెండు దేశాల మధ్య ఉన్న వాణిజ్య విబేధాలను పక్కన పెడతాడని, చైనాపై ఆంక్షలను పెంచుతాడని, పెట్టాలన్న బ్రిక్స్ దేశాలు వెనక్కు తగ్గి అలాంటిదేమీ లేదని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లేకుంటే ప్రతికూల చర్యలు తప్పవని బెదిరించాడు.ఇటీవలి సంవత్సరాలలో మనదేశ విదేశీ వాణిజ్య భాగస్వాములలో చైనా, అమెరికా ఒకటి రెండు స్థానాలలో ఉ ంటున్నాయి. ట్రంప్ ఎన్ని మాటలు మాట్లాడినా అమెరికా అధ్యక్షుడు భారత్‌కు మిత్రుడని, రెండుదేశాల సంబంధాలు మరింతగా విస్తరిస్తాయని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ వంటివారు పొగుడుతూనే ఉన్నారు. హెచ్1బి వీసాల గురించి అనేక ఊహాగానాలు సాగుతున్నాయి. గడచిన పదేండ్లలో చూస్తే అవి తగ్గాయి తప్ప పెరగలేదు. అమెరికా విధాన జాతీయ సంస్థ (ఎన్ఎఫ్ఏపి) సమాచారం ప్రకారం 2014-15లో ఉన్న వీసాల సంఖ్యతో పోలిస్తే ఎనిమిదేండ్ల కాలంలో 75శాతం తగ్గాయి, అమెరికాలోని మనదేశ కంపెనీల రిక్రూట్‌మెంట్లు కూడా తగ్గాయి. ట్రంప్ అధ్యక్షుడుగా కొలువు తీరాక నిజంగా ఏం చేస్తాడో చూడాల్సి ఉంది

సంస్థలపై కూడా ఆంక్షలు విధించారు. ఈ సంస్థలు పాక్ బాలిస్టిక్ ప్రోగ్రామ్‌కు సహకరిస్తున్నట్లు తేలిందని అమెరికా చెప్పింది.

# భారీ అగ్నిప్రమాదం

**మొదటిపేజీ తరువాయి...**

20 మంది గాయపడినట్టు తెలుస్తుంది. అగ్ని ప్రమాద సమాచారం తెలుసుకున్న వెంటనే ఘటనా స్థలానికి ఫైర్ టెండర్లు చేరుకున్నాయి. 22 ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలను ఆర్పడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రమాదం కారణంగా అక్కడ దట్టంగా పొగలు అలుముకున్నాయి. దీంతో పక్కనే ఉన్న రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ప్రమాదంలో గాయపడినవారిని సవాయ్ మాన్‌సింగ్ ఆసుపత్రిలోని అత్యవసర వార్డుకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. మరికొద్దిసేపట్లో రాజస్థాన్ ముఖ్యమంత్రి కూడా ప్రమాద స్థలికి చేరుకోనున్నారు.

# భూభారతి బిల్లుకు శాసనసభ ఆమోదం

**మొదటిపేజీ తరువాయి...**

ఆక్రమణలు తొలగించి రైతుల హక్కులు కాపాడేందుకు గత ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు తెచ్చాయని అన్నారు. భూభారతిపై వాడీవేడిగా చర్చ సాగింది. బిల్లుపై విపక్ష బీఆర్ఎస్ సభ్యులు చర్చించకుండా ఆందోళనకు దిగారు. బిల్లుపై చర్చించాలని, ఇది రైతులకు సంబంధించినదని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పదేపదే సూచించారు. భూముల అన్యాక్రాంతం, లక్షల కోట్ల అవినీతి జరిందని డిప్యూటి సిఎం భట్టి, మంత్రి పొంగులేటి ప్రకటించినా ఎందుకు సిబిఐ విచారణకు ఆదేశించలేదని బిజెపి నేతమహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. ఈ క్రమంలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు సహనం కోల్పోయి స్పీకర్ గడ్డం ప్రసాద్ పట్ల దారుణంగా వ్యవహరించారని అన్నారు. అమర్యాదగా ప్రవర్తించి సభాపతిపైనే పేపర్లు విసిరారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శాసనసభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ప్రతిపక్షం వ్యవహార శైలి, ధరణి పోర్టల్, కేసీఆర్, ఫార్ములా-ఈ కార్ రేసుపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన విషయాలు బయటపెట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తనపై దారుణంగా ప్రవర్తించినా స్పీకర్ గడ్డం ప్రసాద్ మాత్రం సహనాన్ని ప్రదర్శించారని ఆయన అన్నారు. ప్రతిపక్షం అహంభావంతో వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి' మాత్రం రైతులను తమ భూములకు దూరం చేసింది. 2010లో ఒడిశా కూడా ఇదే ధరణి విధానాన్ని తీసుకొస్తే.. ఒడిశా ప్రభుత్వం తప్పు చేసిందని ఎన్ఐసీ, కాగ్ సూచించాయి. అనుభవం లేని ఐ అండ్ ఎల్ఎఫ్ఎస్ సంస్థకు అప్పగించొద్దని హెచ్చరించింది. తెలంగాణ ప్రభుత్వం మాత్రం యువరాజుకు అత్యంత సన్నిహితుడైన గాదె శ్రీధర్‌రాజు కంపెనీకి ధరణి పోర్టల్ నిర్వహణను అప్పగించారు. క్రిమినల్ కేసుల్లో ఇరుక్కున్న సంస్థలను ఐఎల్ అండ్ ఎల్ఎఫ్ఎస్ సంస్థ టేకోవర్ చేసుకుంది. అవకతవకలకు పాల్పడిన సంస్థకు ధరణి పోర్టల్ బాధ్యతను అప్పగించారు. ధరణి టెండర్ దక్కగానే ఈ సంస్థ పేరు, యాజమాన్యం మారింది. ఫాల్కన్ హెచ్‌బీ అనే ఫిలిప్పీన్ కంపెనీ, తర్వాత సింగపూర్ కంపెనీ ఇందులోకి వచ్చాయి. 50 లక్షల మంది రైతులు, వారి భూముల వివరాలను ఈ సంస్థ చేతిలో పెట్టారు. ట్యాక్స్ హెవెన్ దేశాల కంపెనీల చేతిలో మన ధరణి పోర్టల్ పెట్టారు. ఫిలిప్పీన్స్, సింగపూర్, కెమెన్ హైలాండ్స్, వర్జీన్ ఐలాండ్ మీదుగా ధరణి పోర్టల్ తిరిగింది. పోర్టల్ నిర్వహణ ఏ కంపెనీ చేతిలోకి వెళ్లినా.. సీఈవోగా గాదె శ్రీధర్‌రాజే ఉన్నారు' అని సీఎం వివరించారు. సీఎం ప్రసంగం తర్వాత భూ భారతి బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. విపక్ష పార్టీ అహంభావంతో అహంకారంతో వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సభా మర్యాదలను ఉల్లంఘించి సభాపతిపైనే దాడి చేస్తామన్న ధోరణిలో చర్చను అడ్డుకోవాలని ప్రయత్నించిందన్నారు. 'రెచ్చగొట్టడం ద్వారా భూ భారతి బిల్లుపై చర్చను పక్కదోవ పట్టించాలని ప్రయత్నించినా.. చాలా ఓర్పుతో సభాపతి వ్యవహరించారు. ఏ మాత్రం సహనం కోల్పోకుండా.. వాళ్లంతట వాళ్లే సహనం చచ్చిపోయి సహకరించాల్సిన పరిస్థితి కల్పించి సభను ముందుకు నడిపించారు. తెలంగాణ రైతాంగానికి ఉపయోగపడే కీలకమైన, ముఖ్యమైన బిల్లుపై చర్చ జరిగే విధంగా కృషి చేసిన సభాపతిని అభినందిస్తున్నా' అని సీఎం తెలిపారు. అద్భుతమంటూ ధరణి పోర్టల్ తీసుకొచ్చారని, ధరణి గురించి గత ప్రభుత్వం ఎన్నో గొప్పలు చెప్పిందని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్ ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారని, కానీ వాస్తవాలు మరోలా ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఆ పోర్టల్‌ను కేసీఆర్ కనిపెట్టలేదని, 2010లోనే ఒడిశా ప్రభుత్వం ఈ-ధరణిని తీసుకొచ్చిందని సీఎం వెల్లడించారు. ఒడిశా తెచ్చిన ధరణిలో లోపాలు ఉన్నాయని కాగ్ చెప్పిందని, కాగ్ తప్పుబట్టిన ధరణిని తెలంగాణలో ఎందుకు పెట్టారని అసెంబ్లీ వేదికగా కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ తనకంటే గొప్పోళ్లు లేరని అనుకుంటారని, అందుకే ఆయన అలా ప్రవర్తిస్తారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కేటీఆర్‌కు అత్యంత సన్నిహితులకే ధరణి టెండర్లు కేటాయించారు. సత్యం రామలింగరాజు సంస్థలతో ఉన్న బంధంతోనే ధరణి పోర్టల్ తీసుకొచ్చారు. ధరణి నిర్వహణలో మన రాష్ట్ర పౌరులు ఎవరూ లేరు. కనీసం పక్క రాష్ట్రాలకు చెందిన వారూ లేరు. టీఎస్‌టీఎస్ ఆధ్వర్యంలోనే ధరణి టెండర్లు వేశారు. ఐటీ శాఖ పరిధిలోనే టీఎస్‌టీఎస్ ఉంటుంది. ఆర్థిక నేరాలు చేసిన కంపెనీల ద్వారా డేటాను దేశం దాటించారు. ప్రజలను మోసం చేసి సమాచారాన్ని క్రిమినల్స్‌కు అందించారు. ఈ నేరాలకు ఏం శిక్ష విధించాలో తెలియాలంటే చట్టాలన్నీ చదవాలి. ధరణిలోకి డజన్ల కొద్దీ కంపెనీలు ఎందుకు వచ్చాయి?. మన భూముల సమాచారం మొత్తం విదేశాల్లో ఉంది. రెవెన్యూ శాఖ, సీఎం దగ్గర ఉండాల్సిన సమాచారం విదేశాలకు వెళ్లింది. ఇన్ని అవకతవకలు ఉన్నా అద్భుతమంటూ ఎన్నికల్లో మాట్లాడారు. ఇవన్నీ మేము గత ఎన్నికల ముందే చెప్పాం. ధరణిలో మార్పులు చేయాలంటే ప్రభుత్వ అనుమతి ఉండాలి. నిబంధనలు ఉల్లంఘించి కంపెనీలు ఒప్పందం చేసుకున్నాయి. ధరణి పేరుతో వాళ్ల అరాచం, దుర్మార్గం చెప్పలేని స్థాయికి చేరింది. అనుమతి లేకుండా వ్యక్తిగత సమాచార సేకరణ నేరం. గాదె శ్రీధర్‌రావు ద్వారా విదేశాలకు సమాచారం పంపించారు. వాళ్లు ఒక్క క్లిక్ కొడితే సమాచారం మొత్తం నాశనమవుతుంది. మన దగ్గర ఉన్న సర్వర్లు క్రాష్ అవుతాయి. అందుకే విచారణకు ఇవ్వడంపై ఇంతకాలం ఆలోచన చేశాం. విదేశాలకు వెళ్లి వివరాలు ఇవ్వాలని కోరినా సహకరించలేదన్నారు.

## భూభారతిపై చర్చించకుండా అడ్డు

**మొదటిపేజీ తరువాయి...**

వారి తీరు సభ్యసమాజం సిగ్గుపడేలా ఉంది. సభలో గూండాగిరి, దౌర్జన్యం, రౌడీయిజం లేకుండా స్పీకర్ చర్యలు చేపట్టాలి. భారాస హయాంలో తీసుకొచ్చిన 'ధరణి' పోర్టల్ తప్పులతడకగా ఉందని కేసీఆర్‌కు తెలుసు. ఆయన 80వేల పుస్తకాలు చదివారు. పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించి ధరణి పోర్టల్ రూపొందించారని అనుకునేవాళ్లం. ఆ చట్టానికి మూడేళ్లకే వందేళ్లు నిండాయి. ఇందిరమ్మ రాజ్యంలో1971లో చేసిన చట్టం.. 49 ఏళ్లుగా ప్రజల్లో ఉంది. భూ భారతి బిల్లుకు సంబంధించి భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అనేక సూచనలు ఇచ్చారు. ఈ బిల్లు సభలో ప్రవేశపెట్టినప్పుడు ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా సూచనలు చేస్తారని ఆశించాం. అవి చట్టంలో పొందుపరచాలని భావించాం. కేసీఆర్ రాలేదు.. సభలో ఉన్నవాళు ఈరకంగా గొడవ చేస్తున్నారు. భారాస చిల్లర వేషాలను ప్రజలు హర్షించరు' అని పొంగులేటి వ్యాఖ్యానించారు. అంతకుముందు హరీశ్‌రావు తీరుపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భారాస సభ్యుల ఆందోళన సందర్భంగా స్పీకర్ మాట్లాడారు. 'హరీశ్‌రావు తీరు రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేసేలా ఉంది. సభను తప్పుదోవ పట్టించడం సరికాదు. భూ భారతి ముఖ్యమైన బిల్లు. ప్రజలకు సంబంధించిన బిల్లులపై చర్చల సమయంలో ఇలా ప్రవర్తించడం సరికాదు. ఈ బిల్లు ఇష్టం లేదా? రైతులకు సాయం చేయడం ఇష్టం లేదా?'అని స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఈ-ఫార్ములా సంస్థతో కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం

**మొదటిపేజీ తరువాయి...**

ఈ ఫార్ములా సంస్థతో జరిగిన కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం అంతా ప్రజల ముందు పెడతానని పేర్కొన్నారు. వెంటనే విచారణ జరపాలని.. అధికారులకు సూచించానన్నారు. ఇప్పటి వరకు నాలుగుసార్లు సభ జరిగింది.. కానీ దీని గురించి చర్చకి అడగలేదని అన్నారు. ట్విట్టర్ పిట్ట ఇన్నాళ్లు ఎక్కడ పోయాడు.. బీఆర్ఎస్ వాళ్లకు మెదడు కూడా పోయినట్టు ఉందని సీఎం దుయ్యబట్టారు. ఎక్కడికైనా వస్తా.. చర్చ చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అవసరం అనుకుంటే వాళ్ల పార్టీ ఆఫీస్ కి ఐనా వెళ్తానని తెలిపారు. హెచ్ఎండీఏ ఖాతాలోని డబ్బులు లండన్ కంపెనీకి ఎలా వెళ్ళాయని సీఎం అడిగారు. ఈ- కార్ రేస్ అగ్రిమెంట్ రూ.55 కోట్లు కాదు.. రూ.600 కోట్లు అని ముఖ్యమంత్రి తెలిపారు. రూ. 600 కోట్లు లూటీ చేయాలని ఫార్ములా ఈ-రేస్ తెచ్చారని సీఎం పేర్కొన్నారు. నగదు బదిలీ చేయాలంటే ఆర్బీఐ అనుమతి ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఓఆర్ఆర్ టెండర్లు రద్దు చేయండని అంటున్నారు.. విచారణ జరగకుండా రద్దు చేస్తారా..? అని సీఎం ప్రశ్నించారు. విచారణ అడిగింది వాళ్ళే.. డిమాండ్ చేసింది వాళ్ళేనని సీఎం తెలిపారు. చర్చకు నేను వెనక్కి పోయే వాడినా అధ్యక్షా.. దేని మీద నైనా చర్చకు సిద్ధంగా ఉంటానని ముఖ్యమంత్రి చెప్పారు. హరీష్ రావు అడిగితేనే ఓఆర్ఆర్ పై సిట్ వేశామన్నారు. ఈ విషయంపై కేసీఆర్ ఇంట్లో గొడవ జరిగిందని తెలిపారు. ఇంటికి వెళ్లాక హరీష్ కు కొరడా దెబ్బలు ఉంటాయన్నారు. హరీష్ బాధను తాను అర్థం చేసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

# కొత్త ఏడాదికి కమలానికి కొత్త అధ్యక్షుడు



తెలంగాణలో ఈసారి ఎలాగైనా అధికారంలోకి రావాలన్న పట్టుదలతో ఉన్న బీజేపీ జాతీయ నాయకత్వం మదిలో ఏముందో రాష్ట్రంలోని కీలక నేతలకు సైతం అంతు చిక్కడంలేదు. అధికార పీఠమే అంతిమ లక్ష్యమని, ఇందుకోసం అనుసరించే వ్యూహంలో వేసే ఎత్తుగడలు మాత్రం అనూహ్యంగా ఉండబోతున్నాయని బీజేపీ ముఖ్యనేత ఒకరు తెలిపారు. పార్టీలో కొంతమంది సీనియర్ నేతల మధ్య అంతర్గత విభేదాలున్నాయి. పాత, కొత్త నేతల పంచాయతీలతో రాష్ట్ర పార్టీ వ్యవహారాలు నాలుగు స్తంభాలాటగా మారాయన్న విషయం అధినాయకత్వం దృష్టికి కూడా వెళ్లిందంట. తాము అధికారంలోకి రావాలంటే ముందు పార్టీలో సమన్వయం అవసరమని భావిస్తున్న పార్టీ పెద్దలు.. ఆ దిశగా కొత్త అధ్యక్షుడికి బాధ్యతలు కట్టబెట్టాలని భావిస్తున్నారంట.అన్ని సవాళ్లను ఎదుర్కొని పార్టీని అధికారంలోకి తీసుకురాగలిగే నేతకే ఢిల్లీ పెద్దలు పట్టం కట్టబోతోతున్నారంట.. పోరాట పటిమ, సమన్వయం చేసుకునే సమర్థతతోపాటు వయసును కూడా ప్రామాణికంగా తీసుకునే అవకాశం ఎక్కువగా ఉందంటున్నారు. ఇందుకోసం ఇప్పటికే ఎమ్మెల్యేలు, ఎంపీలతోపాటు పలువురు సీనియర్ నేతల నుంచి అభిప్రాయాలు తీసుకున్న పార్టీ అధిష్టానం.. తాజాగా మరోసారి కొంతమంది ముఖ్యుల నుంచి అభిప్రాయాలు తీసుకుందని పార్టీవర్గాలు వెల్లడించాయి.మరోవైపు సంస్థాగత ఎన్నికలకు సంబంధించి బీజేపీ ఇప్పటికే కసరత్తు ముమ్మరం చేసింది. గత నెల 25 నుంచి ఈ ప్రక్రియను మొదలు పెట్టింది. కాగా ఈనెల 15 లోపు బూత్ కమిటీ ఎన్నికలు పూర్తి చేయాలని చూస్తోంది.

**మొదటిపేజీ తరువాయి...**

అందుకు పార్టీ హైకమాండ్ ఇప్పటికే దిశానిర్దేశం చేసింది. 15 నుంచి 20 వరకు మండల కమిటీలు కంప్లీట్ చేయాలని చూస్తోంది. ఈ ప్రక్రియ అనంతరం రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు వెళ్లేందుకు నాయకత్వం సిద్ధం అవుతోంది. ఇప్పటికే పార్టీ బూత్ ల వారీగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి వరుసగా వర్క్‌షాప్‌లు నిర్వహించింది. గ్రౌండ్ నుంచి పార్టీని స్ట్రాంగ్ చేయదాంతో పాటు,. సంస్థాగత ఎన్నికల నిర్వహణ, సభ్యత్వాలు, యాక్టివ్ మెంబర్ షిప్ అంశాలపైనా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసింది.ఇక సంస్థాగత ఎన్నికల్లో భాగంగా ఇప్పటికే జాతీయ, రాష్ట్ర సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారులను, జిల్లాల వారీగా ఇంచార్జ్‌లను హైకమాండ్ నియమించింది. జాతీయ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా తెలంగాణకు చెందిన రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ ను, రాష్ట్ర సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణను నియమించింది. వారు ఇప్పటికే సంస్థాగతంగా ఎన్నికలకు కసరత్తు ముమ్మరంగా కొనసాగిస్తున్నారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడితో పాటు జాతీయ అధ్యక్షుడు ఎవరవుతారనే ఉత్కంఠ కాషాయ శ్రేణుల్లో నెలకొంది. స్టేట్ ప్రెసిడెంట్ కోసం చాలా మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు రేసులో ఉ న్నారు. ఎంపీల్లో రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్, ఈటల రాజేందర్, డీకే అరుణ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అలాగే ఎమ్మెల్యేల్లో రాజాసింగ్, పాయల్ శంకర్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ఇప్పటికే కొంతమంది నేతలు పార్టీ హైకమాండ్ ఆశీస్సులు పొందాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్టుగా తెలుస్తోంది. అయితే పార్టీ అధ్యక్షుడు ఎవరనే దానిపై అధిష్టానం ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. దీంతో హైకమాండ్ నిర్ణయానికి అనుగుణంగానే సంస్థాగత ఎన్నికలు జరిగుతున్నాయనే చర్చ ఆ పార్టీలో జరుగుతోంది. పార్టీ డిసైడ్ చేసిన నేతకే మద్దతు తెలిపి లాంఛనంగా ఎన్నుకుంటారనే టాక్ సైతం వినిపిస్తోంది. అధ్యక్షుడు ఎవరనే నిర్ణయం జరిగిపోవడంతో.. ఇక ఆ పేరు చుట్టూనే ఎన్నిక హడావుడి కొనసాగనుంది. అభ్యర్థి ఈటల రాజేందరే అంటున్నారు. అయితే పార్టీ డిసైడ్ చేసింది ఎవరిని అనేది కాషాయశ్రేణుల్లో సస్పెన్స్‌గా మారిందంట.

## వేగంగా ధాన్యం సేకరణ

**పెనమలూరు/గంగూరు, యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20 :** 'రాష్ట్రంలో ధాన్యం సేకరణ చాలా వేగంగా జరుగుతోంది. రైతుల నుండి సకాలంలో పౌరసరఫరా శాఖ అధికారులు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇదే సమయానికి 12.55 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తే...నేడు మా ప్రభుత్వంలో ఇప్పటికే 21,04,233 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాం. రాష్ట్రంలో 3,20,703 మంది రైతుల నుంచి ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు చేశాం' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పెనమలూరు నియోజకవర్గం, గంగూరులో రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమయ్యారు. రైస్ మిల్లులను తనిఖీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 'గత ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు చెల్లించకుండా వేధించడంతో రైతాంగం బాగా నష్టపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ధాన్యం కొనుగోలు చేసిన కేవలం 48 గంటల్లోనే రైతులకు డబ్బు చెల్లిస్తున్నాం. 93 శాతం మంది రైతులకు 24 గంటల్లోపే చెల్లించాం. రైతుల నుండి ధాన్యం కొన్నందుకు రూ.4,730 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశాం. ధాన్యంలో తేమ శాతంలో తేడాలు లేకుండా చూడాల్సిన అవసరం ఉంది. గోతాల్లో నింపిన గింజలు తేమ శాతం పేరుతో వెనక్కి రాకూడదని అన్నారు. ధాన్యంలో తేమ శాతం తగ్గించేందుకు వివిధ ప్రాంతాల్లో డ్రైయర్స్ కూడా పెట్టాం. సేకరించిన ధాన్యంలో కేవలం 23 శాతం ధాన్యం మాత్రమే డ్రైయర్స్ ద్వారా ఆరబెడుతున్నారు. రైతుల ఆదాయం పెంచేందుకు చేపట్టాల్సిన జాగ్రత్తలను తప్పకుండా తీసుకుంటాం. గతంలో కంటే రైతులు ఇప్పుడు చాలా ఆనందంగా ఉన్నారు. గతంలో కంటే ఇప్పుడు పంట దిగుబడి ఎక్కువగా వస్తుందని రైతులే చెప్తున్నారు.

## రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్‌ను ఖండించిన ప్రియాంక గాంధీ

**మొదటిపేజీ తరువాయి...**

ఈ కేసు అంబేద్కర్ వారసత్వాన్ని కాపాడినందుకు రాహుల్‌కి దక్కిన గౌరవ చిహ్నమని (బ్యాడ్జ్ ఆఫ్ ఆనర్) అన్నారు. బిజెపి రాజకీయ కక్షతో ఇప్పటికే రాహుల్ 26 కేసులను ఎదుర్కొంటున్నారు. ఈ తాజా ఎఫ్ఐఆర్ రాహుల్‌ను ఆర్ఎస్ఎస్-బిజెపి పాలనకు వ్యతిరేకంగా నిరోధించదని అన్నారు. తమపై భౌతిక దాడికి పాల్పడిన బిజెపి నేతలపై కాంగ్రెస్‌కు మహిళా ఎంపిలు దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లపై మాత్రం ఢిల్లీ పోలీసులు చర్యలు తీసుకోలేదని ఎత్తిచూపారు. మహిళా ఎంపిల ఎఫ్ఐఆర్‌లపై ఢిల్లీ పోలీసులు చర్యలు తీసుకోరా అని ప్రశ్నించారు.

మినహాయింపు లేదు. భారతదేశ చట్టాల ప్రకారం జర్నలిస్టులు, సామాన్య పౌరులు అంతా సమానమే. మీడియా వారైనా సరే, ఏ సామాన్యుడి ఇల్లు అయినా, సెలబ్రిటీ ఇల్లు అయినా వారి గోడ దాటి అనుమతి లేకుండా లోపలికి ప్రవేశిస్తే వారిపై ఆ భవన యజమాని కేసు పెట్టవచ్చు. బ్లిక్ పర్సనాలిటీల వ్యక్తిగత వ్యవహారంపై ప్రజలందరికీ ఉత్సాహం ఉంటుంది. అందుకే మీడియా దాన్ని రిపోర్ట్ చేయవలసి వస్తుంది. అదే సందర్భంలో మీడియాపై భౌతిక దాడి సరికాదు. తప్పు చేస్తే చట్టపరంగా వెళ్లాలి అనేది జర్నలిస్టుల వాదన. చొరబడటంలో కూడా చాలా రకాలున్నాయి. ఆయుధాలతో రావడం, రహస్యంగా రావడం, గోడ దూకడం, రాత్రి వేళ రావడం, గేట్లు పగలగొట్టడం.. ఇలా నేరాన్ని బట్టి కేసు తీరు మారుతుంది. ఒకవేళ వేరే వారు అక్కడ గేట్లు పగలగొట్టినా ఆ దారిలో మీడియా వాళ్లు వెళ్ళడం కూడా చట్ట ప్రకారం నేరమే. ఈ స్థలం ఫలానా వారిది ట్రెస్పాసర్స్ విల్ బి ప్రాసిక్యూటెడ్ అని సాధారణంగా కొన్ని ఖాళీ స్థలాల దగ్గర బోర్డులు పెడుతుంటారు. అనుమతి లేకుండా ప్రవేశించిన వారు శిక్షార్హులు అని దీనర్థం. నిబంధన ఇంటికి, ఇతర ప్రైవేటు స్థలాలకు కూడా వర్తిస్తుంది. మీడియా వారికి, సెలబ్రిటీలకు కూడా ఇందులో మినహాయింపు లేదు. కాకపోతే, అమెరికా వంటి దేశాల్లో ఇది అందరూ పాటిస్తారు. మనదేశంలో చట్టాలపై అవగాహన తక్కువ కాబట్టి, ఎక్కువ మంది దీన్ని గౌరవించరు. కానీ, ఎవరైనా గట్టిగా నిలబడి కేసు పెడితే, కచ్చితంగా చొరబాటు చేసిన వారికి శిక్ష పడుతుంది అంటున్నారు న్యాయనిపుణులు. అంతేకాదు, తమ స్థలం లేదా భవనంలోకి చొచ్చుకు వస్తున్న వారిని ఆపే హక్కు కూడా ఆ స్థల యజమానులకు ఉంటుంది. అయితే దాని అర్థం భౌతిక దాడులు చేయవచ్చని కాదు. వారిని ప్రవేశించకుండా ఆపవచ్చు అని మాత్రమే చట్టం చెబుతోంది. సాధారణంగా దొంగతనం కోసం, దాడులు చేయడం కోసం, ఆక్రమణ కోసం ఎవరైనా ప్రాపర్టీలోకి వస్తే ట్రెస్పాసింగ్ కేసులు పెడతారు. కానీ మాట్లాడటం కోసం, సమాచారం కోసం, లేదా అసలు ఏ ఉద్దేశం లేకుండా ఊరికే ఇతరుల స్థలంలోకి వెళ్లినా కేసు పెట్టవచ్చా అంటే అవుననే చెబుతోంది చట్టం. అంటే ఇక్కడ చొరబాటుదారుని లక్ష్యం ముఖ్యం కాదు. కాకపోతే ఉద్దేశాన్ని బట్టి శిక్ష తీవ్రత మారవచ్చు. కానీ, అసలు ఏ చెడు ఉద్దేశం లేకుండా వెళ్లినా నేరం నేరమే.ందుకంటే, రేపు ఎవరో ఒకరు నీ ఇంటి ముందుకు వచ్చి కూర్చుంటారు. నాకే ఉద్దేశమూ లేదు. ఊరికే మీ ఇంటి ముందు నుంచుంటా అంటే చెల్లదు కదా? బోర్డు పెట్టినా, పెట్టకపోయినా, ప్రతి ప్రైవేటు ఆస్తి మీద యజమానికి హక్కు సహజంగా ఉంటుంది. శివసేన నాయకుడు ఉద్ధవ్ ఠాక్రే జర్నలిస్టులపై 2020లో ఈ తరహా కేసు పెట్టించారు. తన నివాసంలోకి అక్రమంగా చొరబడ్డారు అంటూ రిపబ్లిక్ టీవీ రిపోర్టర్, కెమెరా పర్సన్, ఆ బండి నడిపిన డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. అలాగే 2018లో చెన్నైలోని ఒక కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థను వీడియో తీస్తున్న ఇద్దరు ఫ్రెంచ్ జర్నలిస్టులపై అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. అంటే ఈ విషయంలో ఎవరికీ మినహాయింపులు లేవని స్పష్టమవుతోంది. చట్ట ప్రకారం పోలీసులు కూడా ప్రైవేటు ప్రాపర్టీలోకి వెళ్లడానికి స్పష్టమైన కారణం ఉండాలి. ఒకటి వారికి ఎవరైనా ఫిర్యాదు చేసి ఉండాలి లేదా, వారికి అక్కడ తీవ్రమైన నేరం, తక్షణం ఆపించాల్సిన నేరం జరుగుతోందన్న కచ్చితమైన సమాచారం వచ్చి ఉండాలి, లేదా కోర్టు లేదా ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన సమాచారం వచ్చి ఉండాలి. అప్పుడే మాత్రమే పోలీసులు ప్రైవేటు ప్రాపర్టీలోనికి అడుగు పెట్టగలరు. అయితే భారతదేశంలో చాలా వరకు ఈ చట్టం మీద అవగాహన లేకపోవడం, అవగాహన ఉన్న వారు కూడా పోలీసులతో అనవసర గొడవ ఎందుకు అనుకుని ఊరుకోవడం సహజంగా కనిపిస్తుంది. ఇక, చొరబడటం మాత్రమే కాదు ఒక వ్యక్తి వెంటపడటం, వెంబడించడం కూడా శిక్షార్హమైన నేరమే. తరచూ వెంటబడటం, ఎక్కడకు వెళ్లినా వెనకాలే వెళ్లడం వంటివి చట్ట ప్రకారం స్టాకింగ్ అనే నేరం కిందకు వస్తాయి. అయితే విస్తృతమైన ప్రజాప్రయోజనం ఇమిడి ఉన్న అంశాల్లో కొన్ని సార్లు మీడియా వెళ్లాల్సి రావచ్చు. అప్పుడు కూడా అది చట్ట వ్యతిరేకమే అయినప్పటికీ విస్తృతమైన ప్రజాప్రయోజనం ఉంది కాబట్టి దాన్ని వెలికితీయడానికి కాస్త రిస్క్ తీసుకోవడం అవసరం అనే వాదన చేయచ్చు. కానీ, అప్పుడు కూడా అది అంతగా ప్రజాప్రయోజనంతో ముడిపడింది అవ్వడం, అందులో కూడా వ్యక్తుల ప్రైవసీకి భంగకరం కాని రీతిలో వ్యవహరించడం లాంటి అంశాలు ముడిపడి ఉంటాయి. చీటికి మాటికీ ఎక్కడ పడితే అక్కడికి మైకులు తీసుకుని దూసుకువెళ్లే అధికారం సాధారణ ప్రజలకు ఎలా ఉండదో మీడియాకు కూడా ఉండదు. దాదాపు పదేళ్ళ క్రితం చిరంజీవి ఇంట్లో ఒక ప్రైవేటు కార్యక్రమం జరిగినప్పుడు ఒక ఇంగ్లీషు పత్రిక ఫోటోగ్రాఫర్ గోడదూకి ఆ కార్యక్రమం లోపలికి వెళ్లారు. అప్పుడు అతనిపై పవన్ కళ్యాణ్ భౌతిక దాడి చేశారు. తరువాత ఫిలిం చాంబర్ లో సినిమా పెద్దలు ఆ ఘటన పట్ల విచారం వ్యక్తం చేశారు. తాజాగా మోహన్ బాబు ఇంటిలోకి మీడియా వెళ్లింది. ఆయనా దాడి చేశారు. ఈ మధ్య ఒక తెలంగాణ నార్కొటిక్స్ అధికారిని ఇంటర్వ్యూ ఇవ్వమంటూ ఒక మహిళా జర్నలిస్టు మీదమీదకు వెళ్లిన ఘటన కూడా ఇటువంటిదే. చిరంజీవి ఘటన సమయంలోనూ ప్రైవసీ అనే అంశం చర్చకు వచ్చింది. మీడియా కూడా తనకున్న పరిమితులు తెలుసుకోవాలి. అందరి ప్రైవసీని మీడియా గౌరవించాల్సిందే. దాన్ని ఉల్లంఘించే హక్కు లేదు. మీడియా కూడా తన పరిమితులు తెలుసుకుని, అక్కడ ఏం జరుగుతోందో చెప్పవచ్చు. రిపోర్ట్ చేయవచ్చు. కానీ ఆవేశపూరిత పరిస్థితులు కుటుంబంలో ఉన్నప్పుడు మధ్యలోకి వెళ్లకూడదు. మీడియా ఆవేశంలో వెళ్లడం పొరబాటు అనిపిస్తుంది. కానీ దానికి ప్రతిగా భౌతిక దాడి చేయడం కూడా సరికాదు. కొందరు అవగాహన లేని మీడియా ప్రతినిధులు అత్యుత్సాహం చూపుతుంటారు. జర్నలిజంలో ఏబీసీడీలు, పాత్రికేయ విలువలు, ఏం చేయాలి, ఏం చేయకూడదు వంటివి తెలియని వారు మీడియాలోకి రావడం వల్ల కూడా సమస్య వస్తోంది. గత కొన్ని రోజులుగా సినీ నటుడు మోహన్ బాబు ఆయన కుమారుడు మనోజ్‌కు మధ్య వివాదం తలెత్తింది. జల్‌పల్లిలోని ఇంట్లోకి తనను రానివ్వలేదంటూ మంచు మనోజ్ మీడియా తీసుకుని ఆ ఇంటివద్దకు వెళ్లారు. అదే సమయంలో సెక్యూరిటీ మనోజ్ దంపతులను లోపలికి అనుమతించలేదు. ఈ క్రమంలోనే మనోజ్ గేటు బద్దలుకొట్టి ఇంట్లోకి వెళ్లారు. అక్కడే ఉన్న మోహన్‌బాబును ఓ మీడియా ప్రతినిధి ప్రశ్నించగా.. ఆయన ఆగ్రహాని గురయ్యారు. అతని మైక్‌తోనే మీడియా ప్రతినిధిని కొట్టారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలోనే తనపై నమోదైన కేసులో మధ్యంతర బెయిల్ ఇవ్వాలంటూ హైకోర్టును ఆశ్రయించారు మోహన్ బాబు. గురువారం విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం ఆయన విజ్ఞప్తిని తోసిపుచ్చింది.అనంతరం తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది. ఈ కేసులో ఎవరి తప్పు ఎంత ఉన్నదో...న్యాయస్థానం ఏం చెబుతుందో చూడాలి. హైకోర్టు తీర్పు కోసం తెలుగు ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు!

డంపింగ్ యార్డు తో అవస్థలు పడుతున్నారు. జగిత్యాల పట్టణం నుంచి సేకరించే చెత్తను నూకపల్లి సమీపంలోని డంపింగ్ యార్డులో వేస్తున్నారు. చెత్త నుంచి ఎరువును తయారు చేయాల్సి ఉండగా కాల్చుతుండగా పొగతో సమీప ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. న్యాక్ కేంద్రంలో 100 మంది విద్యార్థులు శిక్షణ పొందుతుండగా పొగతో ఇబ్బంది పడుతున్నారు.. రెండు రోజుల కిందట ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. చెత్తను కాల్చకుండా ఎరువు తయారు చేయాలని వెంటనే ధీనిపై చర్యలు తీసుకోవాలి అని అధికారులని సమీప ప్రజలు మరియు విద్యార్థులు కోరుతున్నారు.

## కేంద్ర హెూం మంత్రి అమిత్ షా బేషరతుగా క్షమాపణ చెప్పాలి

**-కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం**



**మంథని యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20:** పార్లమెంటులో భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను అవమానించే విధంగా ప్రసంగించిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా బేషరతుగా క్షమాపణ చెప్పాలని మంథని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం శుక్రవారం డిమాండ్ చేశారు. పార్లమెంటులో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని ఉద్దేశించి మాట్లాడిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ఈ మధ్యన అంబేద్కర్ అనే పదం ఫ్యాషన్ అయిపోయిందంటూ హేళనగా మాట్లాడడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. దేశ శాంతి భద్రతులకు విఘాతం కలిగించే విధంగా ప్రసంగించినందుకు వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మంథని మండల అధ్యక్షుడు మంథని రాకేష్, ఎస్సీ సెల్ టౌన్ అధ్యక్షుడు నాగెల్లి జానీ, ఎస్సీ సెల్ నాయకులు కాసిపేట బాపు, ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి అక్కపాక సదయ్య, నాయకులు రోడ్డ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుని పరామర్శించిన మాజీ శాసనసభ్యులు



**రామడుగు యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20:** రామడుగు మండలం గోపాలరావుపేట గ్రామానికిచెందినబీఆర్ఎస్ పార్టీగోపాల్ రావుపేట గ్రామశాఖ అధ్యక్షులు పూడూరి బాలరాజు హాట్ ప్రాబ్లం తో ఐదు రోజులుగా హాస్పిటల్ లో చికిత్స పొంది ఇంటికి వచ్చిన విషయం తెలుసుకున్న మాజీ శాసనసభ్యు లు సుంకే రవిశంకర్ శుక్రవారం బాలరాజు ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య విషయం అడిగి తెలుసుకున్నారు. సుంకే రవిశంకర్ వెంట కొండగట్టు దేవస్థానం డైరెక్టర్ దాసరి రాజేందర్ రెడ్డి అంబేద్కర్ సంఘం అధ్యక్షులు రేణికుంట అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన దుద్దిల్ల శ్రీను బాబు



**మంథని యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20:** మంథని మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో నర్ర లక్ష్మి - శంకర్ ల కుమారుడు ప్రశాంత్ - సంగీత ల వివాహ వేడుకల్లో శుక్రవారం తెలంగాణ ఐటి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సోదరుడు, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిల్ల శ్రీనుబాబు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా అక్కేపల్లి గ్రామానికి చెందిన మబ్బు తిరుపతి మంథని లో ఇటీవల గృహప్రవేశం చేయగా వారి ఇంటికి దుద్దిల్ల శ్రీను బాబు వెళ్లిన శుభాకాంక్షలు తెలియజేశారు.

బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగం ద్వారా వారి చీకటి బ్రతుకులు నుండి వెలుగు వైపు నడిపించి వారికి సమాన హక్కులు కల్పించిన బాబా సాహెబ్ అంబేద్కర్ ను పేరు బదులు దేవుని పేరు తలిస్తే ఏడు జన్మల పుణ్యం వస్తుంది అనడం బిజెపి నేతలకు బిజెపి,పార్టీకి అంబేద్కర్ పైన ఎంతటి ద్వేషం ఉన్నదో అర్థం అవుతుంది అని అన్నారు.మనిషి మనిషిగా చూడని ధర్మాలు దేవుళ్ళు ఒకవైపు ఉంటే మనిషి మనిషిగా గౌరవించే,భారత రాజ్యాంగం ద్వారా ప్రతి బడుగు బలహీన వర్గాల అట్టడుగు వర్గాలకు సమానమైనటువంటి హక్కులు కల్పించి సమానత్వం సమాజాన్ని నిర్మించిన,డాక్టర్ బాబాసాహెబ్ ఈ దేశ ప్రజలకు ఆరాధ్య దైవం అని అతడే ఈ దేశానికి దేవుడు అని ను నూటికి 90 శాతం ఉన్న ప్రజలుకొలుస్తున్నారని అటువంటి వ్యక్తిని కించపరుస్తూ మాట్లాడడం ఎస్సీ,ఎస్టీ,బీసీల పైన బిజెపి,ఆర్ఎస్ఎస్ ఉన్న ద్వేషం స్పష్టంగా నమస్కారం చేసి మాట్లాడిన వ్యక్తి ఈరోజు క్యాబినెట్ మినిస్టర్ అయిన అమిత్ షా అంబేద్కర్ గురించి మాట్లాడితే అతని వెనుకేసుకురావడం అంటే మోడీ యొక్క అంబేద్కర్ పై ఉన్న కపట,నాటకం అర్థమవుతుందని అన్నారు.నిజంగా బాబాసాహెబ్ అంబేద్కర్ పైన ప్రేమ ఉంటే వెంటనే అమిత్ షా ను క్యాబినెట్ నుండి తొలగించి ఎంపీకి రాజీనామా చేయించాల్సిందిగా అలాగే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పించాల్సిందిగా అన్నారు,లేదంటే రేపటి రోజు నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తూ బిజెపి కార్యాలయాలను,బిజెపి ఎమ్మెల్యేలు,ఎంపీలను మంత్రులను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మధు,నాగరాజు, సాయి,ప్రశాంత్, వంశి,వినోదు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలి




**- మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీ పని తీరు పై సంబంధిత అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్**

**యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20:** పట్టణాలలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో మార్చి నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీ పని తీరు పై సంబంధిత అధికారులతో నిర్వహించిన రివ్యూ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణాలలో రోడ్ల పై చెత్త లేకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. పట్టణంలోని ముఖ్యమైన ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, రోడ్లపై చెత్త ప్లాస్టిక్ ఉండకుండా చూడాలని అన్నారు. మంథని, సుల్తానాబాద్ పట్టణాలలో టి.యూ.ఎఫ్.ఐ.డి.సి క్రింద మంజూరైన రోడ్లు, డ్రైయిన్, ఇతర అభివృద్ధి పనులను ప్రాధా న్యత క్రమంలో మార్చి నాటికి పూర్తి చేయాలని , రోడ్డు విస్తరణ మొదలగు అభివృద్ధి పనులకు ఆటంకం గా ఉన్న విద్యుత్ పోల్స్ ను విద్యు శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ తొలగించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పట్టణాలలో ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ పూర్తి స్థాయిలో వసూలు చేయాలని, మున్సిపాలిటీలలో పని చేసే సిబ్బందికి జీతాల చెల్లింపు లేట్ కాకుండా చూడాలని అన్నారు. ఎల్.ఆర్.ఎస్ పెండింగ్ దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించా లని అన్నారు. సుల్తానాబాద్ లోని డివైడర్ లలో మొక్కల పెంపకానికి చర్యలు తీసుకోవా లని కలెక్టర్ తెలిపారు. సుల్తానాబాద్ పట్టణానికి డంప్ యార్డ్ ఏర్పాటుకు అనుకూలమైన స్థలాన్ని తహసిల్దార్ తో ఎంపిక చేయాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో సుల్తానాబాద్ ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యేసుక్రీస్తును అనుసరించి జీవించాలి

**–ఐఎంఐ సెక్రటరీ అంకరి కుమార్**

**మంథని యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20:** యేసుక్రీస్తు బోధనలు అందరూ ఆచరించదగినవని, ఆయనను అనుసరించి జీవించాలని ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్ అన్నారు. శుక్రవారం మంథని మునిసిపాలిటీ పరిధిలోని శ్రీరామ్ నగర్ సీయోను ప్రార్థన మందిరంలో క్రిస్మస్ కేక్ కట్ చేసి క్యారల్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్య మరియ గర్భంలో ఏసుక్రీస్తు జన్మించి తన పవిత్రతను చాటుకున్నాడని, నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించు అనే క్రీస్తు బోధనలు అందరూ ఆచరించ దాగినవన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు, అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీయోను ప్రార్థన మందిరం స్థానిక పాస్టర్ అజ్మీరా దయరాజు, పాస్టర్లు దూడ మహేష్, మంథని మార్క్, గద్దల రాజేష్, సంఘ పెద్దలు ఎం కే జోసెఫ్, మంథని ప్రసాద్,చింతకుంట్ల ప్రేమ్ కుమార్, అందె రమేష్, ఈర్ల సదానందం, రామగిరి కుమార్, కామని మల్లారెడ్డి, ఉప్పలపాటి జాన్, సొల్ల స్వామి, కన్నూరి రాజేశం, సుమంత్ రాజ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా మంథని మాజీ ఎమ్మెల్యే గులుకోట శ్రీరాములు జయంతి వేడుకలు

**-నివాళులర్పించిన బిఆర్ఎస్ నాయకులు**



**మంథని యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20:** మంథని నియోజకవర్గ మొట్ట మొదటి శాసనసభ్యులు స్వర్గీయ గులుకోట శ్రీరాములు 103వ జయంతి ని శుక్రవారం మంథని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా నిర్వహించారు.బిఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్చార్జ్,మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆదేశాల మేరకు మంథని పోస్ట్ ఆఫీస్ ముందు గల గులుకోట శ్రీరాములు విగ్రహానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్ గౌడ్ మాట్లాడుతూ రజాకార్ల పరిపాలనలో గులుకోట శ్రీరాములు పోరాటం చేసిన గొప్ప నాయకుడు అన్నారు. అదేవిధంగా మంథని నియోజకవర్గానికి మొదటిసారి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, కౌన్సిలర్ ఆరేపల్లి కుమార్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు వేల్పుల గట్టయ్య, తగరం శంకర్ లాల్, పుప్పాల తిరుపతి, ఆసిఫ్ ఖాన్,ఇర్ఫాన్, దేవేందర్, జంగటి రాజయ్య లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడలో కోనోకార్పస్ చెట్లను తొలగించాలి

**-సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు**



**వేములవాడ యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20:** వేములవాడలో కోనోకార్పస్ చెట్లను తొలగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు డిమాండ్ చేశారు.వేములవాడ ఫస్ట్ బైపాస్ రోడ్ లో కోనోకార్పస్ చెట్లు ఏపుగా పెరిగి ప్రజా ఆరోగ్యానికి ఇబ్బందిక రంగా ఉన్నాయని,గతంలోనే వేములవాడ మున్సిపల్ కమిషనర్ లెటర్ ఇవ్వడం జరిగిందని కానీ తొలగించలేదని ఈ సందర్భంగా గుర్తుచేశారు.ఇదే విషయమై వేములవాడ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కూడా విజ్ఞాపన చేయడం జరిగిందని తెలిపారు.ప్రపంచ వ్యాప్తంగా హానికరమైన చెట్లని డబ్ల్యూహెచ్వో సైతం ఈ చెట్లను నిషేధించింది అని,కానీ గత బిఆర్ఎస్ ప్రభుత్వం వీటిని హరితహారంలో భాగంగా పెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడారని అన్నారు.ఈ సమావేశంలో సీపీఐ నాయకులు ఆకుల.ఆంజనేయులు, బొడిగె మల్లవ్వ,వావిలాల లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.





భారత కుబేరుల సంపద సన్నగిల్లుతోంది. అంబానీ, అదానీల నికర సంపదలో డౌన్‌ఫాల్ మొదలయ్యింది. కొంతకాలంగా భారత స్టాక్ మార్కెట్ సూచీలు పతనం అవుతుండగా? దిగ్గజ కంపెనీలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీ గ్రూప్ స్టాక్స్ పెద్ద మొత్తంలో పడిపోతున్నాయి. ఈ క్రమంలో దిగ్గజ పారిశ్రామిక వేత్తల నికర సంపద భారీగా తగ్గుతోంది. భారతదేశంలో అత్యంత సంపన్నుల జాబితాలో అగ్ర స్థానంలో నిలవడమే గాక, ఆసియాలోనే ధనికులుగా గుర్తింపు పొందినవారు రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ, అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ. కొద్ది నెలల క్రితం నికర ఆదాయం భారీగా పెరిగిన వీరు, ఇప్పుడు మాత్రం బ్లూమ్ బర్గ్ 100 బిలియన్ డాలర్ల క్లబ్ లో చోటు దక్కించుకోలేకపోయారు. వారి వ్యాపారాలతోపాటు వ్యక్తిగత సంపద విషయంలోనూ ఇద్దరూ సవాళ్లు ఎదుర్కోవడం వల్లే ఈ క్లబ్ నుంచి బయటకు రావాల్సి వచ్చిందని తాజాగా విడుదలైన 'బ్లూమ్‌బర్గ్' నివేదిక పేర్కొంది.అంబానీ ఎనర్జీ, రిటైల్ వ్యాపారాల ప్రదర్శన అనుకున్నంతగా లేకపోవడం కూడా ఈ క్లబ్ నుంచి బయటకు రావడానికి ఒక కారణమని బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. ఇప్పుడు, ప్రపంచ కుబేరుల జాబితాలో టాప్-10లో ఇద్దరిలో ఏ ఒక్కరూ లేకపోవడం గమనార్హం. సెప్టెంబరు 2022లో గౌతమ్ అదానీ.. ప్రపంచంలోనే రెండవ అత్యంత సంపన్న వ్యక్తిగా ఉండగా.. ఇప్పుడు 19వ స్థానానికి పడిపోయారు. ముఖేష్ అంబానీ 17వ స్థానానికి పరిమితమయ్యారు. తాజాగా.. ఇద్దరి సంపద 100 బిలియన్ డాలర్ల మార్క్ దిగువకు చేరినట్లు బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ నివేదిక వెల్లడించింది.జులైలో, తన కుమారుడు అనంత్ అంబానీ పెళ్లి సమయంలో అంబానీ సంపద దాదాపు 120.8 బిలియన్ డాలర్లకు చేరుకుంది. భారత కరెన్సీలో ఇది రూ. 10.25 లక్షల కోట్లు. అదే సమయంలో అంబానీ కుమారుడు వివాహానికి దాదాపుగా 600 మిలియన్ డాలర్లు ఖర్చు చేశారు. అంబానీ ఇటీవల డిజిటల్ ప్లాట్‌ఫాంలు, రిటైల్ బ్రాండ్లపై దృష్టి సారించారు. రిటైల్ వ్యాపారంలో ఇటీవల వృద్ధి, లాభాలు మందగించాయి. ఇక, కేసులతో కొత్త చిక్కులు ఎదుర్కొంటున్నఅదానీ కూడా డౌన్‌ఫాల్‌ను ఎదుర్కొంటున్నారు.సౌరశక్తి సరఫరా ఒప్పందాలు పొందడం కోసం భారతీయ అధికారులకు ముడుపులు ఇచ్చిన వ్యవహారంలో అమెరికాలో కేసు నమోదైన తర్వాత అదానీ సంపదలో క్షీణత మొదలైంది. జూన్‌లో అదానీ సంపద 122.3 బిలియన్ డాలర్లకు చేరుకోగా.. అమెరికాలో ఆరోపణలు, కేసులు.. అంతకుముందు హిండెన్‌బర్గ్ నివేదిక నేపథ్యంలో అదానీ సామ్రాజ్యానికి సవాళ్లు ఎదురయ్యాయి. ఫలితంగా అదాని సంపద 100 బిలియన్ డాలర్ల కంటే దిగువకు పడిపోయింది. బ్లూమ్ బర్గ్ నివేదిక ప్రకారం, ప్రస్తుతం ముకేశ్ అంబానీ సంపద 96.3 బిలియన్ డాలర్లు కాగా? గౌతం అదానీ సంపద 80.8 బిలయన్ డాలర్లుగా ఉంది.ఇక, రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థలోని ప్రధాన వ్యాపారాలైన రిటైల్, ఇంధన రంగాలు ఇటీవల మెరుగైన పనితీరు కనబర్చకపోవడమే ముఖేష్ అంబాని పరిస్థితికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. చమురు, రసాయన విభాగంలో డిమాండ్ తగ్గడం, రిటైల్ వినియోగదారుల వ్యయాలు తగ్గడం, చైనా ఎగుమతుల నుంచి పోటీ వంటివి అంబాని సంపదకు ఎసరు పెట్టాయి. ఈ క్రమంలో, కంపెనీకి పెరుగుతున్న అప్పులపైనా ఇన్వెస్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తుండగా.. రిలయన్స్ గ్రూప్‌పై వచ్చిన ఆరోపణలు వచ్చే ఏడాది కూడా ఆ సంస్థ మార్కెట్ విలువపై ప్రభావం చూపే అవకాశం ఉందని నివేదికలు అంచనా వేస్తున్నాయి. అయితే, గతంలోలాగా మళ్లీ మదుపరుల విశ్వాసం పొందేతే తప్ప ఈ ఇద్దరు కుబేరులు కష్ట కాలం నుండి బయటపడే అవకాశం ఉంది.గౌతం అదానీ, ముకేశ్ అంబానీ వ్యక్తిగత సంపద నష్టపోయినప్పటికీ? భారతదేశంలోని టాప్-20 బిలియనీర్ల సంపద 2024 జనవరి నుంచి 67.3 బిలియన్ డాలర్లు వృద్ధి చెందినట్లు బ్లూమ్‌బర్గ్ నివేదిక వెల్లడించింది. వారిలో ప్రముఖ పారిశ్రామికవేత్త, ఊఅఒ టెక్నాలజీ వ్యవస్థాపకుడు శివ్ నాడార్ 10.8 బిలియన్ డాలర్లు, ఉక్కు పారిశ్రామికవేత్త సావిత్రి జిందాల్ 10.1 బిలియన్ డాలర్ల సంపద పెంచుకున్నారు.మరోవైపు, ఎలన్ మస్క్ కంపెనీ స్టార్ లింక్ భారత్‌లో ఎంట్రీ ఇవ్వడానికి రంగం సిద్ధమైనట్లు కనిపిస్తోంది. దీనితో, స్టార్ లింక్, భారత్‌లో శాటిలైట్ ఆధారిత వాయిస్, డేటా కమ్యూనికేషన్ వంటి సేవలు ప్రారంభిస్తే.. ఎయిర్‌టెల్‌తో పాటు అంబానీ సంస్థ జియో కూడా గట్టి పోటీని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇది, అంబానీ సంపదకు మరో సవాలుగా మారే ఛాన్స్ ఉంది. అంబానీ తిరిగి నిలదొక్కుకోడానికి చేస్తున్న ఈ వ్యూహాలు దీర్ఘకాలిక వృద్ధి సామర్థ్యాన్ని సూచిస్తున్నాయి.తాజా గ్లోబల్, డొమెస్టిక్ సవాళ్లకు కొత్తగా అమెరికా గద్దెనెక్కబోతున్న ట్రంప్ ప్రెసిడెన్సీ కూడా ఒక రకంగా కారణమేనని కొందరు వాదిస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ వైట్ హౌస్‌కి తిరిగి ఎన్నికైన తర్వాత భారతీయ ఎగుమతులపై కొత్త ట్యాక్స్‌లను మోపుతున్నారు. దీని వల్ల భారతీయ వ్యాపారాలకు సంభావ్య వాణిజ్య సవాళ్లు ఎదురవుతాయనే భయం కూడా అందరిలో కనిపిస్తోంది. అయితే, దీని ప్రభావం ఇప్పటికే కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక, రాబోయే రోజుల్లో మరిన్ని సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తుందని కూడా నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ట్రంప్ విధించిన సుంకాలతో భారతదేశ ఎగుమతులు పోటీలో నిలదొక్కుకోలేవని అంటున్నారు.ఇన్ని సవాళ్లు ఉన్నప్పటికీ.. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థ? దేశంలో అభివృద్ధి చెందుతున్న మధ్యతరగతికి అవకాశాలను అందిస్తూనే ఉండటాన్ని మంచి పరిణామంగా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఉద్యోగులు చట్టబద్ధంగా నియమించబడ్డారని వారిని రెగ్యులరైజ్ చేయాలన్నారు. లేదా ప్రభుత్వం పే స్కేల్ అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్నటువంటి అన్ని వసతులు కల్పించాలని వీరి న్యాయమైన డిమాండ్ లను ప్రభుత్వం అమలు చేయాలన్నారు. 2023 లో ఇదే సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెను విరమింపజేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు వీరి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష బాధ్యులు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.

## శిశుగృహ నుండి శిశువు దత్తత



**కరీంనగర్,యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20:** మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని కరీంనగర్ శిశు గృహలో పెరుగుతున్న నాలుగు నెలల మగ శిశువును జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి చేతులమీదుగా వరంగల్ కు చెందిన పిల్లలు లేని దంపతులకు దత్తత ఇచ్చారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ దత్తత కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని అన్నారు. ఇందుకు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం భగత్ నగర్ కరీంనగర్ లో సంప్రదించాలన్నారు. రక్త సంబంధీకుల నుండి కూడా చట్టబద్ధమైన దత్తత తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సబిత, డిసిపిఓ పర్వీన్, తేజస్వి పాల్గొన్నారు.

### మరోసారి పార్టీ మారేందుకు అవంతి ప్లాన్

# 10 ఏళ్లలో నాలుగు పార్టీలు

**విశాఖపట్టణం, యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20:** పదేళ్లలో నాలుగు పార్టీలు.. ఇప్పుడు ఐదో పార్టీలోకి.. ఆ నేత ఎవరంటే? నేతలు పార్టీలు మారడం ఇప్పుడు సర్వసాధారణం. ఏ నాయకుడు.. ఎప్పుడు ఏ పార్టీలో ఉంటాడో తెలియని పరిస్థితి. అధికారమే పరమావధిగా పావులు కదుపుతుంటారు చాలామంది నాయకులు.ఏపీ రాజకీయాల్లో అదృష్టవంతులైన నేతలు చాలామంది ఉన్నారు. అటువంటి వారిలో అవంతి శ్రీనివాసరావు ఒకరు. గంటా శ్రీనివాసరావు శిష్యుడుగా పేరు పొందిన ఈయన ఆయనను అనుసరించారు.అధికార పార్టీకి దగ్గరగా ఇట్టే చేరువవుతూ వచ్చారు.ఈ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయే సరికి ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు.త్వరలో ఆయన తెలుగుదేశం పార్టీలో చేరతారని ప్రచారం నడుస్తోంది.అందుకు తగ్గట్టుగానే పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.అవంతి విద్యాసంస్థల అధినేతగా ఉమ్మడి రాష్ట్రంలోనే ఆయన సుపరిచితం.ప్రజారాజ్యం పార్టీతో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన ఈయన..ఎమ్మెల్యేగా,ఎంపీగా, మంత్రిగా వ్యవహరించారు. తనకు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకున్నారు. 2009 నుంచి 2024 వరకు ప్రజాప్రతినిధిగా కొనసాగారు. ఇప్పుడు చేతిలో పదవి లేకపోయేసరికి..అధికార పార్టీని వెతుక్కుంటూ వెళ్తున్నారు2009లో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ ఏర్పాటు చేశారు.ఆ ఎన్నికల్లో 18 సీట్లకు పరిమితమైంది పిఆర్పి. అయితే విశాఖ జిల్లా నుంచి నాలుగు స్థానాల్లో విజయం సాధించింది ప్రజారాజ్యం. ఆ పార్టీ తరపున భీమిలి నుంచి పోటీ చేసిన అవంతి శ్రీనివాసరావు గెలిచారు. మారిన రాజకీయ పరిణామాల క్రమంలో కాంగ్రెస్ పార్టీలో పిఆర్పీని విలీనం చేశారు చిరంజీవి. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు అవంతి. 2014లో తెలుగుదేశం పార్టీలోకి వెళ్లారు. అనకాపల్లి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి గెలిచారు. అయితే ఎమ్మెల్యేగా గెలిచారు. ఎంపీ అయ్యారు.



కానీ మంత్రి అవ్వాలన్న ఆలోచనతో ఎంపీగా ఉంటూనే వైసీపీకి టచ్ లోకి వెళ్లారు అవంతి. 2019 ఎన్నికల్లో వైసీపీ తరఫున భీమిలి నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచారు అవంతి శ్రీనివాసరావు. జగన్ క్యాబినెట్లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రెండున్నర సంవత్సరాల పాటు మంత్రిగా కొనసాగారు. ఈ ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు టిడిపిలోకి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారుపది సంవ త్సరాల కాలంలో నాలుగు పార్టీలను మార్చారు అవంతి శ్రీనివాస రావు. తొలుత ప్రజారాజ్యం, తరువాత కాంగ్రెస్, మళ్లీ టిడిపి, అక్కడ నుంచి వైసిపి.. ఇలా పార్టీల మీద పార్టీలు మార్చిన ఆయన ఇప్పుడు అధికారానికి దూరం కావడంతో టిడిపి వైపు వచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు. అవంతి శ్రీనివాసరావుకు భీమిలి నియోజకవర్గం లో విద్యాసంస్థలు ఉన్నాయి. ఆయన అధికార పార్టీలో చేరడానికి అదో కారణంగా తెలుస్తోంది. తొలుత గంటా శ్రీనివాసరావు ఆయన రాకను వ్యతిరేకిస్తున్నట్లు ప్రచారం నడిచింది. కానీ ఇప్పుడు గంటా శ్రీనివాసరావు కేవలం ఎమ్మెల్యే మాత్రమే. అందుకే టిడిపిలో ఉన్న పాత పరిచయాలను వినియోగించుకొని అవంతి శ్రీనివాస్ రావు సైకిల్ ఎక్కుతారని ప్రచారం నడుస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# జయసుధపై క్రిమినల్ చర్యలు...

**కాకినాడ, యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20:** ఏపీ మాజీ మంత్రి పేర్ని నాని సతీమణి పేర్ని జయసుధ యజమానిగా ఉన్న జేఎస్ గోడౌన్ లో రేషన్ బియ్యం మాయం ఘటనలో పలు శాఖలు లోతుగా విచారణ జరుపుతున్నా యి. రేషన్ బియ్యాన్ని దారి మళ్లించి ఆధారాలను నాశనం చేయాలని చూశారు. మాయం చేసిన బియ్యానికి డబ్బు కడితే సరిపోతుందని భావిస్తున్నారు. కానీ క్రిమినల్ కేసులు నమోదు చేశాం. తప్పు చేసిన వారు ఎవరైనా శిక్ష తప్పదని ఏపీ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. పోలీస్, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖలు అధికారులు రేషన్ బియ్యంపై చర్యలకు సిద్ధమని తెలిపారు.తెనాలిలోని క్యాంపు కార్యాలయంలో నాదెండ్ల మనోహర్ మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. 'పేర్ని జయసు ధకు చెందిన గోడౌన్ లో 3 వేల బస్తాలు మాయం చేశారనుకున్నాం, కానీ 4840 బస్తాలు మాయం. గత ప్రభుత్వంలో పదవిలో ఉండి ప్రజలు అప్పగించిన బాధ్యత ఎంతో దారుణంగా నిర్వర్తించారో సాక్ష్యాధారాలతో ప్రజల ముందు పెడతాం. కూటమి ప్రభుత్వంలో ఎవరిమీద కక్ష సాధింపు చర్యలు ఉండవు.కానీ తప్పు చేసిన వారు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరు. అక్కడేఉన్నరెండో గోదాము లోనూ అక్రమాలు జరిగాయని అనుమానాలు ఉన్నాయి. పౌరసరఫ రాల శాఖ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశాక ఏపీలోని 1300 రైస్ మిల్లులకు అందించి బియ్యంగా మారుస్తాం. ఆ బియ్యాన్ని మొత్తం 104 గోడౌన్లలో భద్రపరుస్తాం. ఆ నిల్వ చేసిన బియ్యాన్ని రేషన్ కార్డుదారులకు , అంగన్వాడీ కేంద్రాలకు, సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌కు సరఫరా చేస్తాం.పౌరసరఫరాలశాఖలో సంస్కరణ లు తీసుకురావాలని సివిల్ సప్లైస్ ఎండీ మనజీర్ నవంబర్ 26న "వేర్ హౌస్ మేనేజ్మెంట్ సిస్టమ్" అనే సాఫ్ట్ వేర్ తీసుకొచ్చారు. రాష్ట్రంలోని ఏ గోడౌన్ లో ఎంత స్టాక్ ఉంది? ఎక్కడ ఎంత స్టాక్ భద్రపరచాలి? వచ్చే సీజన్ లో ఎంత కొనుగోళ్లు చేయాలి? అనే సమాచారం పొందుపరిచేలా ఈ సాఫ్ట్ వేర్ రూపొందించారు. గోడౌన్ యాజమానులకు, వాళ్ల మేనేజర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులకు ఆన్‌లైన్ వేదికగా ట్రైనింగ్ ఇచ్చారు. ఏ విధంగా తనిఖీలు చేసి కంప్యూటరీకరణ చేయాలో శిక్షణ ఇచ్చారు. నవంబర్ 27వ తేదీన తమ గోదాముల్లో స్టాక్స్ తక్కువగా చూపిస్తోందని, 3 వేల బ్యాగుల రేషన్ బియ్యం షార్టేజి అని వేబ్రిడ్జ్ లో పొరపాటు వల్ల ఇలా జరిగిందని జె.ఎస్. గోడౌన్ నుంచి లేఖ వచ్చింది. గోడౌన్ లో మాయమైన బియ్యానికి డబ్బులు చెల్లిస్తామని సైతం లేఖలో పేర్కొన్నారు' అని నాదెండ్ల మనోహర్ తెలిపారు.జేఎస్ గోడౌన్స్ లో స్టాక్ ఎంత ఉందనని స్టాక్ రిజిస్టర్ ప్రాథమిక సమాచారాన్ని జాయింట్ కలెక్టర్ నుంచి డిసెంబర్ 4న తెప్పించారు. దాని ప్రకారం మాయమైంది 3 వేల బస్తాలు కాదు 3708 బస్తాలు తగ్గాయని తెలిసింది. డిసెంబర్ 10న సివిల్ సప్లైస్ ఎండీ చట్టప్రకారం డబుల్ పెనాల్టీ వేయాలని, జేఎస్ గోడౌన్ ను బ్లాక్ లిస్టులో ఉంచాలని, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. మాయమైన రేషన్ బియ్యంపై విచారణ చేపట్టేందుకు ఆర్డీవో, సివిల్ సప్లైస్ మేనేజర్, లీగల్ మెట్రాలజీ విభాగం నుంచి అసిస్టెంట్ కంట్రోలర్ తో కమిటీ వేశారు.

# కోదాడ అయ్యప్ప స్వామి దేవాలయంలో అన్నదాన కార్యక్రమం



**సూర్యాపేట యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20:** సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని హుజూర్నగర్ రోడ్ లో గల శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తుంటారు. దాతల సహకారంతో ప్రతిరోజు సుమారు 500 మంది అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈరోజు కోదాడ వాస్తవ్యులు ఎలకుర్తి లచ్చిరెడ్డి ధర్మపత్ని రాములమ్మ వీరు కుమారుడు మోహన్ రెడ్డి ధర్మపత్ని విజయలక్ష్మి దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాతలను కోదాడ శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ ఉపాధ్యక్షులు, బిజెపి నాయకులు బొలిశెట్టి కృష్ణయ్య సన్మానించారు.కోదాడ శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం ఎంతో ప్రాముఖ్యత కలిగినది. శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం ప్రాంగణంలో ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. గత రెండు రోజుల క్రితం శివాలయం గర్భగుడిలో నాగుపాము ప్రత్యక్షమైంది. ఆలయ అర్చకులు దివాకర్ స్వామి నాగేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా సమయంలో నాగుపాము అదురు బెదురు లేకుండా పడగయిప్పి భక్తులకు దర్శనమిచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ డైరెక్టర్లు ,అయ్యప్ప స్వాములు ,దాతలు తదితరులు పాల్గొన్నారు.

# బంగారం వ్యాపారస్థులకు కుచ్చు టోపి

**పోరుమామిళ్ళ, యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20:** గోల్డ్ షాప్ యజమాని మహబూబ్ బాషా, బంగారు వ్యాపారస్తులకు 60 లక్షలు కుచ్చు టోపీ పెట్టిన వైనం బయటపడింది. పోరుమామిళ్లలో పట్టణం లోని వసీం జ్యువెలర్స్ యజమాని మెహబూబ్ భాష తన భార్య హర్షత్ ఉన్నీషా 60 లక్షలు విలువచేసే వెండి బంగారు ప్రొద్దుటూరు, చాగలమర్రి, బద్వేల్ , మైదుకూరు, మరియు తదితర 12 మంది వద్ద బంగారు వెండి కొనుగోలు చేసి వ్యాపార స్తులకు కుచ్చుటోపి పెట్టి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న ప్రొద్దుటూరుకు చెందిన గోల్డ్ షాప్ యజమానులు పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్లలో సబ్ ఇన్స్పెక్టర్ కొండారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి ప్రొద్దుటూరు కు చెందిన కొంతమంది వ్యాపారస్తులు దగ్గర గోల్డ్, వెండి తీసుకొని వచ్చి అమ్ముకొని ప్రతి నెల తిరిగి కొంత కొంత డబ్బు చెల్లించేవాడని నెల క్రితం ప్లాన్ ప్రకారం షాపు యజమాని సుమారు 60 లక్షలు విలువచేసే బంగారుతో వెండితో పరారు కావడంతో ప్రొద్దుటూరుకి చెందిన గోల్డ్ యజమానులు పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చెయ్యగా సబ్ ఇన్స్పెక్టర్ కొండారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

## వివేకా పీఏ కృష్ణారెడ్డి ప్రైవేటు కంప్లయింట్ పై పోలీసు విచారణ

**పులివెందుల, యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20:** వివేకా పీఏ కృష్ణారెడ్డి ప్రైవేటు కంప్లయింట్ పై పోలీసు విచారణ ప్రారంభమయింది. పోలీసు విచారణకు వైఎస్ మనోహర్ రెడ్డి హాజరయ్యారు. మనోహర్ రెడ్డిని పులివెందుల డీఎస్పీ మురలీనాయక్ విచారించారు. ఇటీవలే ఈ కేసులో ఏడుగురిని పులివెందుల డీఎస్పీ ప్రశ్నించారు. కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు సునీత, రాజశేఖర్ రెడ్డి, రాంసింగ్ పై కేసు నమోదు అయిన విషయం తెలిసిందే.






**సిద్దిపేట, యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20 :** ఆశా వర్కర్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ. 26 వేల చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ అన్నారు. ఆశా కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్ల బస్ జాతా సిద్దిపేట జిల్లా కు వచ్చిన సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని అంబేద్కర్ చమన్ పాత బస్టాండ్ నుండి ప్రెస్ క్లబ్ వరకు ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆశాలు పది లక్షల మంది పని చేస్తున్నారు. గత 30 సంవత్సారాల నుండి కమ్యూనిటి హెల్త్ వర్కర్స్, గత 20 సం,ల నుండి ఆశాలు ఎన్ హెచ్ ఎం స్కీంలో భాగంగా పనిచేస్తున్నారు. వీరంతా మహిళలు, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారు. వీరంతా నిరంతరం పేద ప్రజలకు ఆరోగ్య సేవలిందిస్తున్నారు. కరోనాలాంటి మహామ్మరి కాలంలో కూడా ముందు వరుసలో ఉండి ప్రజలకు సేవలందించారు. డబ్ల్యుహెచ్ఓ అంతార్జాతీయ సంస్థ ఆశా వర్కరల్లకు గ్లోబెల్ హెల్త్ లీడర్స్ ఆవార్డును కూడ అందించింది. ఇప్పుడు ప్రజలకు వస్తున్న సీజనల్ వ్యాధులతో పాట దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి అరికట్టడంలో, ఆస్పత్రుల్లో డెలివరీల సంఖ్యను పెంచడంలో ఆశాలు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇన్ని పనులు నిర్వహిస్తున్న ఆశాలను కేంద్ర ప్రభుత్వం నేటికి గుర్తించడం లేదు. 45, 46వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసుల ప్రకారం ఆశాలను కార్మికులుగా గుర్తించాలి. కనీస వేతనం పిఎఫ్, ఈఎస్ఐ, సామాజిక భద్రత సౌకర్యాలు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడం దేశానికే అవమానకరం.గతంతో పోల్చినప్పుడు ఈ కాలంలో ఆశాలకు రోజు రోజుకు పనిభారం మరింత పెరుగుతుంది. పారితోషకాలు లేని పనులు చేయిస్తున్నారు. ఏ ఎన్ సి, బి పి, షుగర్ కేసుల టార్గెట్లు పెడుచున్నారు. స్పుటం డబ్బాలను తీసుకురావడం వల్ల రోగాలు బారిన పడుచున్నారు. రోజుకు 12-16 గంటలు పని చేయవలసి వస్తుంది. ఆదివారం పండుగలు, ఆనారోగ్యానికి గురైనప్పుడు కూడా ఆశాలకు సెలవులు ఇవ్వడం లేదు. ఈ పరిస్థితులు ఆశాల ఆరోగ్యం పైన తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. ఆశాల ఆరోగ్యం దెబ్బతిని చివరికి ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య ఈ కాలంలో పెరుగుతున్నది. వీటితో పాటు దేశంలోని ప్రజారోగ్య సౌకర్యాల విషయంలో ఆందోళనకరమైన పరిస్థితి కూడా ఉందని. ఆశాల సమస్యలతో పాటు ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడానికి సరిపడా బడ్జెట్ కేటాయింపులు కేంద్ర ప్రభుత్వ పెంచకపోవడం అత్యంత బాధాకరం. ఒక్కో అశా వర్కర్కు పరిమితి మించి జనాభ ఉన్నది. సిద్దిపేట ఇతర మున్సిపల్ పట్టణాలల్లో మరియు కొన్ని గ్రామాలల్లో రెండు వేల జనభా నుండి పది వేల జనభా వరకు ఉన్నది. దీని వల్ల పని భారంతో పాటు సరియైన సేవలు అందించలేకపోవుచున్నారు. కావున జనాభా పరిమితి ప్రకారం ఆశాలను పెంచాలిని డిమాండ్ చేశారు.అనంతరం వైద్య ఆరోగ్య శాఖ అధికారికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి, జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్, జిల్లా సహాయకార్యదర్శి చొప్పరి రవికుమార్, బస్సు యాత్రలో ఆశా రాష్ట్ర అధ్యక్షురాలు పి జయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి నీలాదేవి,ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి బి.ప్రవీణ, అధ్యక్షురాలు మంజుల, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



**హుస్నాబాద్, యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20 :** జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన క్రీడ పోటీల్లో కోహెడ మండలం శనిగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీలు కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు జిల్లా స్థాయి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో 9వ తరగతి విద్యార్థులు టి.శ్రీనిధి, సిహెచ్.అంజలి లు విజేతలుగా నిలవడం జరిగింది, టి.శ్రీనిధికి గోల్డ్ మెడలను,సిహెచ్.అంజలికి సిల్వర్ మెడల్ లను జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి లు అందించారు, బహుమతులు అందుకున్న ఇద్దరు అమ్మాయిలు ఆత్మ రక్షణకు సంబంధించిన కరాటే పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలవడం పట్ల గర్వంగా ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎమ్.సరళ, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రశంసిస్తూ పాఠశాలలో సత్కరించారు. విద్యార్థులకు"రాణి లక్ష్మీ బాయి ఆత్మరక్ష" పథకం కింద శిక్షణను ఇచ్చిన ఎం.వంశీ ని అభినందించారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ కు ఎంపికైన విద్యార్థిని



**సూర్యాపేట, యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20 :** జిల్లా సాయి సీఎం కప్పు జూనియర్స్ అథ్లెటిక్స్ 100 మీటర్స్ లాంగ్ జంప్ లో మొదటి బహుమతి ఆత్మకూరు ఎస్ మండలానికి చెందిన మేడి అనూష మొదటి స్థానంలో ఎంపికయింది. శుక్రవారం సూర్యాపేట జిల్లా ఎస్వీ డిగ్రీ కళాశాలలో జరిగిన సీఎం కప్ జూనియర్ అండర్ 16 బాలికల అథ్లెటిక్ ఛాంపియన్షిప్ లో 100 మీటర్స్ లాంగ్ జంప్ లలో అనుష విజయం సాధించింది. ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన మేడి నాగయ్య కుమార్తె అనూష హైదరాబాద్ స్పోర్ట్స్ స్కూల్లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. జిల్లా స్థాయి సీఎం కప్పు జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్షిప్ లో పాల్గొని 100 మీటర్స్ లాంగ్ జంపులో మొదటి బహుమతి అందుకుంది . అనూష ఎంపిక పట్ల పలువురు అభినదించారు. తెలంగాణ రాష్ట్ర స్థాయి సీఎం కప్పు హన్మకొండలో 31న ఆడనున్నారు.

## పీజీ పరీక్షలను ఆకస్మికంగా తనిఖీ

### -వైస్ ఛాన్సర్ ఆచార్య యాదగిరి రావు



**జక్రాన్ పల్లి, యదార్థవాది, డిసెంబర్ 20 :** తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న పీజీ పరీక్షలను శుక్రవారం వైస్ ఛాన్సర్ ఆచార్య యాదగిరి రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఒకటవ మూడవ సెమిస్టర్ రెగ్యులర్ థియరీ మరియు ప్రాక్టికల్ పరీక్షలు ఎంఏ, ఎం ఎస్ డబ్ల్యూ, ఎం కామ్, ఎంబీఏ, ఎంసీఏ, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సు మొదటి సెమిస్టర్ ఎల్.ఎల్.బి మరియు ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సు ఐ ఎన్ బి ఏ ఏడవ 9వ సెమిస్టర్ పరీక్షలను తెలంగాణ యూనివర్సిటీ లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీ లో వైస్ ఛాన్సర్లతో అడిషనల్ కంట్రోలర్ సాయిలు, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ రెడ్డి ఉన్నారు.

## తే యూ లో పునచ్చరణ తరగతులు..

**జక్రాన్ పల్లి, యదార్థవాది, డిసెంబర్ 20 :** తెలంగాణ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం, భారతీయ భాషా విభాగాల సంస్థ మైసూరు తెలుగు అధ్యాపకుల పునశిక్షణ కార్యక్రమంలో భాగంగా పునః చరణ తరగతులు శుక్రవారం మూడో రోజుకు చేరాయి. ప్రముఖ కవి విమర్శకుడు గంధ లక్ష్మణరావు పద్య బోధన మెలకువలను అద్వితీయంగా తెలియజేశారు. ప్రముఖ అనువాదకులు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వారాల ఆనందు అనువాదం అనే అంశంపై మెలకువలను తెలియజేశారు. ప్రముఖ వచన రచయిత రావూరి సీతారామారావు వచ్చిన కవితా బోధన వ్యూహాల ను గురించి ప్రసంగించారు. విద్యార్థికి తన చుట్టూ జరుగుతున్న అంశాన్ని ఇచ్చి దాని గురించి వారు అనుకుంటున్నా భావాలను మూడు నాలుగు పంక్తుల్లో రాసే విధంగా అధ్యాపకుడు మొదట ప్రయత్నం చేయాలని తద్వారా విద్యార్థుల్లో కవిత రచనను పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో కన్వీనర్ ఆచార్య లావణ్య, డాక్టర్ లక్ష్మణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారుల మన్ననలు పొందాలి



**సూర్యాపేట, యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20 :** జిల్లాలోని విద్యానగర్ లో జాజు రెస్టారెంట్ ను ప్రారంభించిన పిసిసి సభ్యులు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ ఈ సందర్భంగా కొప్పుల వేణా రెడ్డి మాట్లాడుతూ వ్యాపార సంస్థలు నాణ్యమైన సేవలు అందించి వినియోగదారుల మన్ననలు పొందాలి అని కోరారు. రాష్ట్రంలోనే అందమైన పట్టణం సూర్యాపేట అని అన్నారు. పట్టణంలో భోజన ప్రియులను ఆకట్టుకునేలా కొత్తగా హెూటళ్లు వెలుస్తున్నాయి. హైదరాబాద్ సిటీని పోలిన విధంగా నయా ఫుడ్కల్చర్ మొదలైంది. బ్రాండెడ్ దుస్తుల షాపింగ్ మాల్స్, బిర్యానీ సెంటర్లు క్యూ కడుతున్నాయి. సకల హంగులతో హెూటల్స్ ప్రారంభ మవుతున్నాయి. అభివృద్ధి కి హెూటళ్లలో అందించే ఆతిథ్యం సరికొత్త పుంతలు తొక్కుతున్నది. ఎల్లప్పుడూ కొత్తదనం కోరుకునే వినియోగదారులను వినూత్న థీమ్లతో ఆకట్టుకుంటున్నది. కస్టమర్లను ఆకర్షించడమే లక్ష్యంగా హెూటళ్లు, రెస్టారెంట్లు పసందైన విందుతోపాటు వినోదాన్ని అందించేందుకు పెద్దపీట వేస్తున్నాయని అన్నారు.

## కేంద్ర మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలి




**హుస్నాబాద్, యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20 :** రాజ్యాంగం చేత ఎన్నికోబడి రాజ్యాంగ సృష్టికర్త అంబేద్కర్ ని అవమానపరిచేలా మాట్లాడిన అమిత్ షా వెంటనే తన పదవి నుండి బర్తరఫ్ చేయాలని అలాగే అంబేద్కర్ కు క్షమాపణలు చెప్పాలని కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చిగురుమామిడి మండల కేంద్రంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్, చిగురు మామిడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంది తిరుపతి రెడ్డి ఎస్సీ సెల్ అధ్యక్షులు అందేమేకల పర్శరములు అధ్వర్యంలో రాజ్యసభలో అమిత్ షా అంబేద్కర్ ను కించపరిచేలా మాట్లాడినందుకుగాను శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో అమిత్ షా ,పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎస్సై బి. రాజేష్ కు ఫిర్యాదు చేయడం జరిగింది. బీజేపీ కేంద్ర మంత్రి అమిత్ షా సభలో చేసిన వ్యాఖ్యలు చే దేశ భవిష్యత్తుకు వాళ్ళు చూపే శ్రద్ధ రాజ్యాంగం పై వాళ్ళకి వున్న గౌరవాన్ని నిరూపించారని మండిపడ్డారు రాజ్యాంగ ప్రజాస్వామ్య రక్షకులుగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ముందుండి పోరాడటానికీ సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు బోయినీ వేణుగోపాల్, మండల యువ నాయకులు జిల్లెల్ల రమేష్ , కిషోర్, శ్రావణ్ , వంతడుపుల బిక్షపతి కాంగ్రెస్ కార్యకర్తలు అంబేద్కర్ సంగ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బేతెస్థ మందిర ప్రారంభోత్సవం

### వ్యవస్థాపకులు బిషప్ దుర్గం ప్రభాకర్ హెప్సిబా



**సూర్యాపేట, యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20 :** పట్టణ కేంద్రం లోని యన్. టి. ఆర్ కాలనీ, సీతారాంపురంలో బేతెస్థ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు, జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బిషప్ దుర్గం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘనంగా బేతెస్థ నూతన మందిరాన్ని ప్రారంభించినారు, అనంతరం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించ్చినారు. ఈ కార్యక్రమం నకు ముఖ్య అతిథులుగా రెవ. డా. యం. యస్. వినాయక రావు, బిషప్ సమర్పన్ కుమార్ యేడిద జాన్సీ రాణి, పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమం లో హుజూర్నగర్ నియోజకవర్గ పాస్టర్స్ చైర్మన్ రెవ. డా. మీసా దేవసహాయం, రెవ. డా. బత్తుల జోయెల్ రాజ్, పాస్టర్ మాడుగుల సుందర్ రావు, పాస్టర్ రాజేష్, క్రైస్తవ జానపద గాయకులు బ్రదర్ జీడీ సుందరన్న, సూర్యాపేట రూరల్ అధ్యక్షులు పాస్టర్ యల్క ప్రభాకర్, రెవ. డా. పంది మార్క్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ బ్రదర్ బొల్లు జాన్ పాల్, కొమ్ము హెూసన్నా,పాస్టర్ కొండేటి లాజర్, మొరుగురి రూబెన్, పాస్టర్ రెబెల్లి యేసురత్నం, నర్సింగ్ భాస్కర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ పై దాడిని ఖండించిన జుక్కల్ ఎమ్మెల్యే



**జుక్కల్, యదార్థవాది, డిసెంబర్ 20 :** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం అసెంబ్లీలో శుక్రవారం ధరణి స్థానంలో భూభారతి బిల్లు ప్రవేశపెట్టే సమయంలో, ఉద్దేశ్య పూర్వకంగానే సభను తప్పు దారి పట్టించే విధంగా.. ఫార్ములా – ఈ కార్ రేసులో జరిగిన అక్రమాల పట్ల కేటీఆర్ మీద ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అంశం గురించి చర్చ పెట్టాలని హరీష్ రావు నేతృత్వంలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దౌర్జన్యానికి దిగుతూ.. దళితుడైన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ని అవమానప రిచేవిధంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ మీద పేపర్లు విసురుతూ, వెల్ లోకి దూసుకెళ్లి దాడికి యత్నించిన తీరు పట్ల జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ఖండించారు. దళితుడు స్పీకర్ గా ఉన్నందుకే మాజీ సీఎం,ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ అసెంబ్లీకి రావట్లేదని అన్నారు.పార్లమెంట్ లో కేంద్ర మంత్రి అమిత్ షా రాజ్యాంగ ప్రధాత బాబా సాహెబ్ అంబేద్కర్ అవమానించే విధంగా వ్యాఖ్యలు చేశారని, అదేవిధంగా ఇక్కడ తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దళిత స్పీకర్ మీద దాడికి యత్నించారని విచారం వ్యక్తం చేశారు..తెలంగాణ అసెంబ్లీ చరిత్రలో ఇది ఒక చీకటి రోజుగా అభివర్ణించారు..శాసనసభ సమావేశాలు జరుగుతు న్నప్పుడు సభలో ప్లకార్డులు ప్రదర్శించవద్దు , నినాదాలు చేయొద్దు, వెల్ లోకి రావొద్దని గత బీఆర్ఎస్ ప్రభుత్వమే నిబంధనలు తీసుకొచ్చిందని..ఈ నిబంధనలతోనే గతంలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంపత్ సస్పెండ్ చేశారని తెలిపారు..ఇవే నిబంధనలు అమలు చేస్తూ స్పీకర్ ని అవమాన పరుస్తూ, సభ నియమాలు ఉల్లంఘించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు..

దర్యాప్తు ఇప్పటికే పూర్తయినందున మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కేటీఆర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సుందరం, ప్రభాకర్‌రావు, గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపించారు. అవినీతి నిరోధక చట్టం కింద పెట్టిన సెక్షన్లు ఈ కేసుకు వర్తించవని, ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని కోరారు. 'అవినీతి నిరోధక చట్టం కింద పెట్టిన సెక్షన్లు ఈ కేసుకు వర్తించవు. ముఖ్యంగా 13(1)(జీ) సెక్షన్ ఈ కేసుకు వర్తించదు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని అనేందుకు ఆధారాలు లేవు. ప్రొసీజర్ పాటించలేదనడం సరైంది కాదు. 14 నెలల తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రాథమిక విచారణ కూడా లేకుండా కేసు పెట్టారు. కేవలం రాజకీయ కక్షసాధింపు కోసమే కేటీఆర్‌పై కేసు పెట్టారు.ఈ కేసులో ఎన్నో తప్పులు కనిపిస్తున్నాయి. కార్ రేస్ నిర్వహణకు 2022 అక్టోబరు 25న ఒప్పందం జరిగింది. సీజన్ 10 నిర్వహణకు స్పాన్సర్ వెనక్కి తగ్గారు. రేస్ నిర్వహణలో ఇబ్బందుల నివారణకే ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఇబ్బందులు రాకూడదనే హెచ్ఎండీఏ చెల్లింపులు చేసిందని వాదించారు. సీజన్-9 వల్ల దాదాపు రూ.700 కోట్ల లాభం వచ్చింది. ఆర్థికశాఖ అనుమతి లేదని ఏసీబీ అధికారులు అంటున్నారు. కార్ రేసింగ్ ఒప్పందాన్ని కొత్త ప్రభుత్వం ఉల్లంఘించింది. కొత్త ప్రభుత్వం డబ్బు చెల్లించకపోవడంతో ఒప్పందం రద్దయింది. ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యానికి కారణాలు చెప్పలేదు. సుప్రీం తీర్పుల ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యం తగదు. ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు ప్రాథమిక విచారణ అవసరమని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయి. సుప్రీంకోర్టు తీర్పులను ఏసీబీ అధికారులు పట్టించుకోలేదు. ప్రజాప్రతినిధిపై కేసుకు ముందు ప్రాథమిక విచారణ చేయాలి. 18న ఫిర్యాదు అందగానే.. 19న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేటీఆర్ స్పెక్యులేషన్ చేసినట్టు ఎక్కడా పేర్కొనలేదు. అవినీతి ఎక్కడ జరిగిందో చెప్పలేదు. కానీ, అవినీతి నిరోధక చట్టం కింద కేసు పెట్టారు' అని కేటీఆర్ తరఫు న్యాయవాది సుందరం వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'ఎఫ్ఐఆర్ నమోదు ప్రాథమిక అంశం మాత్రమే. అందులో పేర్కొన్న అంశాలే అంతిమం కాదు. దర్యాప్తులో తేలే విషయాల ఆధారంగా సెక్షన్లు చేరుస్తారు. రెండు నెలల క్రితమే కేసు నమోదుకు నిర్ణయించారు. కేసు నమోదు కోసం గవర్నర్



నిర్ణయానికి పంపారు. గవర్నర్ ఆమోదించాకే కేసు నమోదు చేశారు. ఫార్ములా సంస్థకు డబ్బు విదేశీ కరెన్సీలో చెల్లించారు. దీంతో హెచ్ఎండీఏపై అధిక భారం పడింది. విదేశీ కరెన్సీలో చెల్లింపు కోసం ఆర్‌బీఐ అనుమతి తీసుకోలేదు. ఆర్థికశాఖ అనుమతి కూడా లేదు' అని ఏజీ వివరించారు. గవర్నర్ అనుమతి కాపీని కోర్టు అడగడంతో ఏజీ అందజేశారు. చెల్లింపుల్లో కేటీఆర్ పాత్ర ఏంటని ఈ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. కేటీఆర్ పాత్ర ఏంటో దర్యాప్తులో తేలుతుందని ఏజీ తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు అనేది దర్యాప్తు కోసమేనని వివరించారు. కేసు పూర్తి వివరాలు అభియోగపత్రంలో ఉంటాయని, రూ.56 కోట్లకు పైగా చెల్లింపుల్లో నిబంధన ఉల్లంఘన జరిగిందని ఏజీ కోర్టు దృష్టికి తెచ్చారు. ఫార్ములా ఈ-కార్ రేస్‌లో కేటీఆర్‌పై ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసును కొట్టివేయాలని మాజీ మంత్రి పిటిషన్ వేశారు.



**హైదరాబాద్, యథార్థవాది ప్రతినిధి, డిసెంబర్20 :** తొలి అడుగులోనే కేటీఆర్ నైతిక విజయం సాధించారని, అందుకు అభినందనలు తెలియజేస్తున్నానని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. హైకోర్టులో కెటిఆర్‌కు అనుకూలంగా పరిస్థితి ఉందని అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఇది డొల్ల కేసు అని మొదటి అడుగులోనే స్పష్టమైంది. సీఎం రేవంత్‌రెడ్డి ఫార్ములా-ఈ రేసు అంశంపై అసెంబ్లీలో పచ్చి అబద్దాలు మాట్లాడారు. ఫార్ములా-ఈ రేసింగ్‌పై అసెంబ్లీలో చర్చించాలని కోరితే.. భారాస సభ్యులను సభ నుంచి బయటకు పంపి చర్చించారు. ఫార్ములా-ఈ రేస్‌కు మూడో విడత కింద 50 శాతం నిధులు.. 45 లక్షల పౌండ్లు చెల్లించకపోవడం వల్ల అగ్రిమెంట్ రద్దు చేసుకుంటున్నామని ఏవీవీ కంపెనీ డిసెంబరు 22న దాన కిశోర్‌కు లేఖ రాసింది. 50శాతం నిధులు అంటే కేవలం రూ.45 కోట్లు మాత్రమే. నిధుల చెల్లింపుల్లో ఇర్రెగ్యులారిటీ తప్ప.. ఇల్లీగల్ మాత్రం లేదు. రేసింగ్ నిర్వహించిన సంస్థకు హెచ్ఎండీఏ నుంచి చెల్లింపులు జరిగాయి. ఫార్ములా రేసింగ్ నిర్వహించేందుకు 192 దేశాలు పోటీపడ్డాయి. రేసింగ్ కోసం మొదటి దఫాలో రూ.30కోట్లు ఖర్చు పెడితే జీఎస్టీ రూపంలో రాష్ట్ర ఖజానాకు రూ.71 కోట్లు వచ్చింది. మూడో విడతలో రూ.45 కోట్లు చెల్లిస్తే.. రాష్ట్రానికి రూ.600 కోట్ల లాభం వచ్చేది. ఫార్ములా-ఈ కార్ రేసింగ్ వల్ల తెలంగాణ ప్రతిష్ఠ పెరిగింది. తమిళనాడు ప్రభుత్వం ఫార్ములా-4 నిర్వహించి రూ.140 కోట్లు ఖర్చు పెట్టింది. చంద్రబాబు ప్రభుత్వం రూ.120 కోట్లు ఖర్చు పెట్టి ఆఫ్రో-ఏసియన్ గేమ్స్ నిర్వహించింది. గత ప్రభుత్వం చేసిన కార్యక్రమాలు కొనసాగొద్దని, సభలో కేటీఆర్ నిలదీయకుండా ఉండాలని అక్రమ కేసులు పెడుతున్నారు. రేవంత్‌రెడ్డి చర్యల వల్ల రాష్ట్ర పరపతి, ఇమేజ్ దెబ్బతింటోంది. తన ఏడాది పాలనా వైఫల్యం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు గిమ్మిక్కులు చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి కుటుంబం అవినీతిని ఎప్పటికప్పుడు కేటీఆర్ బయటపెడుతున్నారు. రేవంత్‌రెడ్డి చర్యల వల్ల రాష్ట్రంలో స్థిరాస్తి రంగం కుదేలైంది. మాకు కోర్టుల మీద నమ్మకం ఉంది. అక్రమ కేసులకు భయపడేది లేదు. ఫార్ములా రేసింగ్ కేసు వివరాలు ఈడీ అడిగిందని వార్తల్లో చూశాను. నిన్న నమోదు అయిన కేసులో వెంటనే ఈడీ జోక్యం వెనుక మతలబు ఏంటి? కాంగ్రెస్, భాజపా దోస్తానా స్పష్టంగా అర్థమవుతోంది. కుట్రలు చేసి కేటీఆర్‌ను జైలులో పెట్టడమే రేవంత్‌రెడ్డి లక్ష్యం. అసెంబ్లీలో చర్చ పెడితే కేసు డొల్లతనం బయటపడుతుంది' అని హరీశ్‌రావు అన్నారు.

# అక్కడ అంబేడ్కర్‌కు..ఇక్కడ స్పీకర్‌కు అవమానం

**కెటిఆర్ ఎందుకు భయపడుతున్నట్లు**

**జైలులో యోగా చేస్తానని చెప్పలేదా**

**కేబినేట్ అనుమతి లేకుండా డబ్బులు ఎలా చెల్లిస్తారు**

**మంత్రి సీతక్క ఘాటు విమర్శలు**

**భారాస ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు చేయాలన్న కాంగ్రెస్**



**హైదరాబాద్, యథార్థవాది ప్రతినిధి, డిసెంబర్20:** పార్లమెంటులో అంబేద్కర్‌ను, అసెంబ్లీలో దళిత స్పీకర్‌ను అవమానించారని మంత్రి సీతక్క అన్నారు. అసెంబ్లీ ఆవరణలో మీడియాతో చిట్‌చాట్‌లో ఆమె మాట్లాడారు. క్యాబినెట్ ఆమోదం తీసుకొని ఫార్ములా ఈ-రేసుకు కేటీఆర్ డబ్బులు చెల్లించారా అని ప్రశ్నించారు. ముసుగు వేసుకుని భారాస రాజకీయం చేస్తోందని విమర్శించారు. 'జైలుకు వెళ్లి యోగా చేస్తానన్న కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారు. తప్పు చేయకపోతే విచారణ ఎదుర్కొని నిర్దోషిగా బయటికి రావచ్చు కదా? కేటీఆర్ తన సమస్యను రాష్ట్ర ప్రజల సమస్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతి లేని అంశానికి సభలో చర్చ ఎందుకు అని అడిగారు. గవర్నర్ క్లియరెన్స్ ఇచ్చిన కేసుకు సభలో చర్చ అవసరం లేదని చెప్పారు. బీఏసీలో ఫార్ములా ఈ-రేసు మీద చర్చ కోసం భారాస ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. గతంలో ప్రభుత్వ కేసులు ఎదుర్కొన్న నాయకులు కోర్టుకు వెళ్తే తప్పుపట్టిన ఆయన.. ఇప్పుడు కోర్టు మెట్లు ఎందుకు ఎక్కారు? కేటీఆర్‌కు నిజాయతీ లేదు. లక్షలాది మంది రైతులకు ప్రయోజనం చేకూర్చే భూ భారతి బిల్లుపై చర్చ జరగకుండా అడ్డుకునే కుట్ర చేస్తున్నారు. వాళ్ల భూ కబ్జాల బాగోతం బయట పడుతుందనే ఇలా చేస్తున్నారు. అందరూ చట్టం ముందు సమానులే.. ఫార్ములా ఈ-రేసు కేసులో విచారణ ఎదుర్కోవాల్సిందే' అని సీతక్క చెప్పారు. ఇదిలావుంటే భారాస ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. స్పీకర్‌ను అవమానించిన వారి సభ్యత్వం రద్దుకు డిమాండ్ చేస్తున్నామన్నారు. దళిత వ్యక్తి సభాపతి అయినందునే ఎమ్మెల్యేలు పేపర్లు చింపి విసిరారన్నారు. వారి ప్రవర్తన దురహంకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. దళితుడైన స్పీకర్‌పై పరుష పదాలతో మాట్లాడారని చెప్పారు. గతంలో సంపత్‌కుమార్ పేపర్ విసిరేస్తే అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. భారాస ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయాలని స్పీకర్, సీఎంను కోరుతున్నామని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తెలిపారు. శుక్రవారం తెలంగాణ శాసనసభలో అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. భారాస ఎమ్మెల్యేలు ఫార్ములా ఈ-రేసుపై చర్చకు పట్టుబట్టారు. అది ఒక వ్యక్తికి సంబంధించిన అంశమని స్పీకర్ తెలిపారు. దీంతో భారాస ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా మార్షల్స్ అడ్డుకున్నారు. ఈక్రమంలో భారాస శాసనసభ్యులు పేపర్లు చించి సభాపతి వైపు విసిరారు. అనంతరం భారాస ఎమ్మెల్యేలు ఉన్న వైపు కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పేపర్లు చించి విసిరారు. వారంతా పరస్పర నినాదాలు, ఆరోపణలు చేసుకున్నారు.

# ఎపిలో ఇన్నోవేషన్ యూనివర్సిటీ

**రెండు సంస్థలతో ప్రభుత్వం ఒప్పందం**

**అమరావతి, యథార్థవాది ప్రతినిధి, డిసెంబర్20:** అధునాతన సాంకేతిక ఆవిష్కరణల కేంద్రంగా ఆవిర్భవిస్తున్న ఆంధ్రప్రదేశ్‌లో డీప్-టెక్‌ను అభివృద్ధి చేయడంలో భాగంగా ఏపీ ప్రభుత్వం రెండు ప్రధాన సంస్థలతో కీలక ఒప్పందాలు చేసుకుంది. ఫిజిక్స్ వాలాఎడ్యుటెక్ కంపెనీ తన పరిశ్రమ భాగస్వామి అమెజాన్ వెబ్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్‌లో ఎ- ఫోకస్డ్ ఫస్ట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ యూనివర్సిటీ ఆఫ్ ఇన్నొవేషన్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. రాష్ట్రంలో ఉన్నత విద్యను ఆధునికీకరించేందుకు టోనీ ÷-లబెయిర్ ఇనిస్టిట్యూట్ (÷ఃఎ)తో మరో ఒప్పందం చేసుకుంది. ఉండవల్లిలోని నివాసం రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఫిజిక్స్ వాలా, టోనీ ÷-లబెయిర్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు వేర్వేరుగా ఏపీ ప్రభుత్వతో ఒప్పందం చేసుకున్నారు.

# రాజ్యాంగ నిర్మాత పై అనుచిత వ్యాక్యాలు తగవు



**నంద్యాల, యథార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20 :** రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి పై కేంద్ర హెూం మంత్రి అమిత్ షా చేసిన వాక్యాలను ఖండించిన కాంగ్రెస్ ( జూమ్లు జానో జాగో ) కాంగ్రెస్ మస్తాన్ ఐయూఎంఎల్ సలాం మౌలానాజానో జాగో సయ్యద్ మహబూబ్ బాషా మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై కేంద్ర హెూం మంత్రి అమిత్ షా చేసిన వాక్యాలను ఖండించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి పాలకులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఆధారంగా పరిపాలన కొనసాగిస్తున్నారు. కానీ వీరికి కేంద్ర ప్రభుత్వానికి మాత్రం గౌరవంలేదని, రాజ్యాంగ నిర్మాత పై అనుచిత వ్యాక్యాలు తగవని, రాజ్యాంగం మీద ఎటువంటి నమ్మకం విశ్వాసం గౌరవము లేదు వారి ఆలోచన అంతా అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని తీసివేసి ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని అమలు చేయాలని భావిస్తున్నారు అలాంటప్పుడు అంబేద్కర్ రాజ్యాంగాన్ని ఎలా గౌరవించాలని ఆయన అన్నారు

# గిరిజన గ్రామాలకు మహర్దశ



**-డోలీ బాధల నుంచి విముక్తి**

**-పలు గ్రామాలకు రోడ్డు సౌకర్యం**

**-రూ.36.71 కోట్ల వ్యయంతో, 39.32 కి.మీ. మేర రోడ్లు**

**పార్వతీపురం,యథార్థవాది ప్రతినిధి, డిసెంబర్20:** గిరిజన ప్రాంతాలకు మహర్దశ దక్కింది. తరచూ డోలీలో ప్రయాణించే ప్రమాదం నుంచి బయటపడనున్నారు. రాష్ట్ర ప్రజల కష్టాలు తీరాలని తిరుపతి కొండ ఎక్కినప్పుడు మొక్కుకున్నానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గం మక్కువ మండలం పనసభద్ర పంచాయతీ బాగుజోల గ్రామంలో ఆయన పర్యటించారు. గిరిజన ప్రాంతాల్లో స్వయంగా పర్యటించిన పవన్.. ప్రధాన మార్గం నుంచి బాగుజోల గ్రామానికి నడిచి వెళ్లారు.. గిరిజనుల కష్టాలను స్వయంగా చూసి తెలుసుకున్నారు.. గిరిజనులకు డోలీ మోతలు తప్పేలా కొత్త రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు.. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం నూతన రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం గిరిజన గ్రామాల్లో సుమారు రూ.36.71 కోట్ల వ్యయంతో, 39.32 కి.మీ. మేర నూతన రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు.. తద్వారా 55 గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. 2017 పోరాట యాత్ర సమయంలో గిరిజన ప్రాంతాల్లో పర్యటించినప్పుడు కొన్ని సమస్యలు చూశానని పవన్ తెలిపారు. తాగునీరు, రహదారులు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.500 కోట్లతో రుషికొండ ప్యాలెస్ కట్టారు గానీ.. ఇక్కడ రోడ్లు మాత్రం వేయలేకపోయారని వైకాపా పాలనను విమర్శించారు. గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందే విధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పవన్ అన్నారు. కూటమి ప్రభుత్వం వద్ద డబ్బు లేకపోయినా గిరిజన ప్రాంతాల్లో రహదారులు నిర్మిస్తున్నట్లు చెప్పారు. సుందరమైన జలపాతాలు ఉన్న ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనలో ఉన్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. తన అభిమానులకు స్వీట్ వార్నింగ్ ఇచ్చారు..అయితే, ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతుండగా.. ఓజీ.. ఓజీ.. అంటూ ఆయన అభిమానులు నినాదాలు చేశారు.. వెంటనే వారికి స్వీట్ వార్నింగ్ ఇచ్చిన ఆయన.. ఓజీ.. ఓజీ.. అని అరవకండి.. నన్ను పని చేసుకోనివ్వండి అని సూచించారు.. నేను డిప్యూటీ సీఎంను అయినా.. ఇంకా సీఎం సీఎం అని అరుస్తున్నారు.. ఇది సరైంది కాదని హితవు చెప్పారు.. ఇక, తిరుబాటును, భాషను నేర్పించిన నేల ఇది.. మీరు సినిమాల మోజులో పడి? హీరోలకు జేజేలు కొట్టడం కాదు.. మీ జీవితాల మీద దృష్టి పెట్టండి అని సూచించారు.. ఇక,



మాట్లాడితే అన్నా మీసం తిప్పు.. మీసం తిప్పు అంటారు.. నేను మీసం తెప్పితే రోడ్ల పడవు చాతీ మీద కొట్టుకుంటే రోడ్లు పడవు.. నేను ప్రధాని, ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్లి చెబితే రోడ్లు పడతాయి.. అందుకే నన్ను పని చేయనివ్వండి అంటూ విజ్ఞప్తి చేశారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. 2019లో నన్ను గెలిపించలేదు? పరీక్షించారు నిలబడతాడో లేదో అని.. అది మంచిదే అన్నారు.. రోడ్ల నిర్మాణంలో క్వాలిటీ ఉందో మీరు చెక్ చేస్తూ ఉండాలి.. గొడవ పెట్టుకోండి అని సూచించారు.. డోలిలో గర్భిణీలు చనిపోతే నా చెల్లి, అక్క చనిపోయినంత బాధపడే వాడిని అంటూ గుర్తుచేసుకున్నారు పవన్ కల్యాణ్.

**మెదక్, యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20:** మెదక్ కేథడ్రల్.. దక్షిణ భారతదేశంలో అత్యధికంగా సందర్శించే చర్చిల్లో ఒకటి. దీనిని బ్రిటిష్ వెస్లియన్ మెథడిస్టులకు చెందిన చార్లెస్ వాకర్ పోస్నెట్ నిర్మించారు. 1914 - 1924 మధ్య దాదాపు 10 సంవత్సరాల నిర్మాణం తర్వాత.. డిసెంబర్ 25, 1924న దీన్ని ప్రారంభించారు.బ్రిటిష్ వెస్లియన్ మెథడిస్టులు మెదక్ చర్చిని నిర్మించారు, దీనిని డిసెంబర్ 25, 1924న పవిత్రం చేశారు. సందర్శించే చర్చిల్లో ఇది ఒకటి. మరో విశేషం ఏంటంటే.. భారతదేశంలో ఎక్కువ ఫొటోలు తీసింది ఈ చర్చినేమెదక్ చర్చి దక్షిణ భారతలో బిషప్ స్థానం దక్కించుకుంది. మెదక్ డయోసెస్ ఆసియాలో అతిపెద్దది. ప్రపంచంలో రెండవ అతిపెద్ద డియోసెస్ ఇక్కడే ఉంది.మెదక్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుగుతాయి. విదేశాలు, దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వస్తారు. క్రిస్మస్ రోజున ఈ చర్చి లోపల బోధించే ప్రసంగం పట్టణం అంతటా వినబడుతుంది. పురాతన మెదక్ కోట వరకు బోధనలు వినబడతాయి

# షకీల్, ఆయన కుమారుడు... పరార్

**నిజామాబాద్, యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20 :** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోనే ఆ ఎమ్మెల్యేకి ఒక ప్రత్యేకత ఉండేది. ఆయన హడావుడి కూడా అలాగే ఉండేది. అయితే మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయాక ఆయన మాయమయ్యారంట. దాంతో అక్కడ గులాబీపార్టీ పట్టించుకునే దిక్కు లేక అనాథలా తయారైందంట. గత ఎన్నికల్లో అక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించిన ఆ మాజీ ఎమ్మెల్యే ఇప్పుడు నియోజక వర్గాన్ని వదిలేసి సంవత్సరం గడుస్తుందంట. పార్టీ కార్యకర్తలకు పెద్దదిక్కుగా ఉండాల్సిన ఆయన నాకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తుండటం ఎందుకో? ఎవరికీ అంతుపట్టడం లేదంట.. అసలు మిస్సింగ్ అయిన ఆ మాజీ ఎమ్మెల్యే ఎవరు?? ఆ నియోజకవర్గం ఏది?నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజవర్గం ఒకప్పుడు బీఆర్ఎస్‌కి కంచుకోట. రెండు సార్లు ఎమ్మెల్యేగా పోటీ గెలిచి .. గత ప్రభుత్వంలో రాష్ట్రంలోనే ఏకైన మైనార్టీ ఎమ్మెల్యేగా పేరుపొందిన మహ్మద్ షకీల్ ఇప్పుడు నియోజకవర్గంలో కనిపించడం మానేశారు. గత సంవత్సర కాలంగా పార్టీకి, నియోజకవర్గానికి దూరం ఉంటూ తన సతీమణి అయోషా ఫాతిమాకు పెత్తనం అప్పగించి విదేశాలకు వెళ్లిపోయారు .. షకీల్‌తో పాటు ఆయన కొడుకు సాహిల్‌పై ఉన్న కేసుల నేపథ్యంలో అప్పటినుంచి ఇండియాకు రాలేదు. అయితే ఇప్పటికే రాష్ట్ర పోలీసు శాఖ షకీల్ ఆయన కొడుకు రాహిల్‌పై ఉన్న కేసులు నేపథ్యంలో లుకౌట్ నోటీసులు జారీ చేసింది.ఈ ఏడాది ఆరంభంలో మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు ప్రజాభవన్ వద్ద రోడ్డు ప్రమాదం చేశాడు. కొడుకుని తప్పించడానికి షకీల్ తీవ్ర ప్రయత్నాలు చేశారు. యాక్సిడెంట్ కేసులో తనకుమారుడిని తప్పించడానికి షకీల్ సహకరించాడని అభియోగాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. ఆ ఇద్దరితో పాటు మరో నలుగురు విదేశాలకు పారిపోవటంతో లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. అప్పటినుంచి మాజీ ఎమ్మెల్యే షకీల్ అహ్మద్ తన నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడడం లేదు.షకీల్ పారిపోతూ నియోజకవర్గంలో పార్టీ బాధ్యతలు తన సతీమణి ఫాతిమాకు అప్పగించారంట. అప్పటి నుంచి బీఆర్ఎస్ పిలుపు మేరకు ఫాతిమా అడపాదడపా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అయితే ఆమె కార్యకర్తలకు బలమైన భరోసా ఇవ్వలేక పోతున్నారని పార్టీ వర్గాలు పెదవి విరుస్తున్నాయి. గత ఎన్నికల్లో షకీల్ మీద కాంగ్రెస్ నుంచి



పోటీ చేసిన మాజీ మంత్రి, సీనియర్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి గెలుపొందారు.రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటం, సుదర్శన్‌రెడ్డి బలమైన నేత అవ్వడం, దానికి తోడు మంత్రివర్గ విస్తరణలో ఆయనకు మంత్రి పదవి ఖాయమన్న ప్రచారంతో ? బోధన్‌లో కారు పార్టీ మొత్తం కాళీ అవుతుందంట. ఇప్పటికే మున్సిపల్ ఛైర్మన్ తూము పద్మాశరత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరగా కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. దాంతో బీఆర్ఎస్‌లో మిగిలింది రూపాయిలో చారణా భాగవే అంటున్నారు? వాళ్ళను అయినా కపడుకుంటారో లేదో అన్న చర్చ నియోజకవర్గంలో నడుస్తుంది.బోధన్ నియోజవర్గానికి షకీల్ దూరమవ్వడంతో.. ఆయన భార్య ఫాతిమా పార్టీకి, కేడర్‌కి తానే పెద్ద దిక్కని నమ్మకం కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఆమె కార్యకర్తలకు పూర్తిస్థాయిలో భరోసా ఇవ్వలేకపోతున్నారంట. రాష్ట్రంలోనే మైనార్టీ ఫుడ్ బ్యాంక్ ఉన్న నియోజకవర్గాల్లో బోధన్ నియోజకవర్గ ఉంటుంది. అక్కడ తరచూ పొలిటికల్ వివాదాలు, ఇసుక మాఫియా ఆగడాలు, వివిధ ఇల్లీగల్ యాక్టివిటీస్ చోటుచేసుకుంటాయి. అంత వివాదాస్పదమైన నియోజవర్గం కాబట్టే ఫాతిమా వివాదాలు, కార్యకర్తల పంచాయతీలు పరిష్కరించలేక పోతున్నారంట.ఇక వచ్చే ఎన్నికల్లో తానే ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని ఫాతిమా ప్రచారం చేసుకుంటున్నారు. అయితే ఎన్నికలకు ఇంకా నాలుగు సంవత్సరాలు సమయం ఉండడంతో .. అప్పటికి ఆమెకు బీఆర్ఎస్ టికెట్ ఇస్తుందో? లేదో? చూద్దాం లే అని కేడర్ లైట్ తీసుకుంటుందంట.. మరి లుక్‌ఔట్ నోటీసులు ఉన్న మాజీ ఎమ్మెల్యే షకీల్ నాలుగేళ్లకైనా విదేశాల నుంచి తిరిగివస్తారా?.. ఆయన్ని రప్పించడానికి పోలీసులు చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తాయా?.. బోధన్ బీఆర్ఎస్‌కు దిక్కెవరన్నది సెగ్మెంట్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

మీసేవా దరఖాస్తులు, కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్, ఓటర్ల జాబితా తయారీ, తదితర అంశాలపై కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్రాంతి లోపల ధరణిలో పెండింగ్ ఉన్న దరఖాస్తులను పరిష్కరించాల్సిన అవసరం ఉందని అన్నారు. జిల్లాలో 4,400 ధరణి దరఖాస్తులు పెండింగ్ ఉంటే వీటిలో దాదాపు 2400 దరఖాస్తులు ఫిజికల్ ఫైల్ అందని కారణంగా పెండింగ్ ఉన్నాయని, వీటిని పూర్తి చేసేందుకు సంబంధిత ఫైల్స్ వెంటనే రెవిన్యూ డివిజన్ అధికారి,అదనపు కలెక్టర్, కలెక్టర్ కార్యాలయాలకు అందించాలని కలెక్టర్ తెలిపారు.మండలాల్లో పెండింగ్ ఉన్న దరఖాస్తులు త్వరగా పరిష్కరించేందుకు ఎటువంటి వ్యూహం పాటించాలో ఒక ప్రణాళిక తయారు చేసుకోవాలని అన్నారు. ప్రతి తహసిల్దార్ తన దగ్గర ఉన్న పెండింగ్ దరఖాస్తులు ఎలా పరిష్కరించాలో ప్రణాళికను రెవెన్యూ డివిజన్ అధికారికి సమర్పించాలని, సంక్రాంతి వరకు ఎట్టి పరిస్థితుల్లో దరఖాస్తులు పరిష్కారం అవ్వాలని అన్నారు. 5 ఎకరాల కంటే తక్కువ ఉన్న ఆర్.ఎస్ఆర్ దరఖాస్తులను డిసెంబర్ నెలలో, 10ఎకరాల వరకు ఉన్న ఆర్.ఎస్ఆర్ దరఖాస్తులు సంక్రాంతి వరకు పరిష్కరించాలని, 10 ఎకరాల కంటే ఎక్కువ ఉన్న దరఖాస్తులను సంక్రాంతి తర్వాత ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పరిష్కరిద్దామని కలెక్టర్ తెలిపారు. మండలంలో ప్రజావాణి కార్యక్రమానికి స్పందన రావడం లేదని, మండల స్థాయి సమస్యలకు జిల్లా వరకు దరఖాస్తుదారులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత తహసిల్దార్ లపై ఉంటుందని కలెక్టర్ తెలిపారు. మండల ప్రజావాణికి వచ్చే దరఖాస్తుల డిస్పోజల్ లో క్వాలిటీ పెంచాలని, మండల ప్రజావాణి కార్యక్రమంపై ప్రజలలో నమ్మకం పెంచాలని అన్నారు. మండలంలో పాలనపై తహసీల్దార్లు పట్టు సాధించాలని అన్నారు. మండల పరిధిలో ఉన్న రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టల్స్, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, మోడల్ స్కూల్స్ తనిఖీ చేస్తూ పిల్లలకు నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు పర్యవేక్షించాలని కలెక్టర్ తెలిపారు. మండలంలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు తనిఖీ చేయాలని అన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల సందర్శనలో బియ్యం నాణ్యత, ఆహార సామాగ్రి భద్ర పరిచే స్టోర్ రూమ్ ను తప్పనిసరిగా పరిశీలించాలని, దుప్పట్లు ఉన్నాయా, దోమల నుంచి రక్షణకు తీసుకుంటున్న చర్యలు చేపట్టాలని, చిన్న, చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని అన్నారు. స్లాట్ బుకింగ్ సమయంలో రిజిస్ట్రేషన్ కోసం వచ్చే ప్రజలను అనవసరంగా అధిక సమయం వేచి ఉండేలా చూడవద్దని,ఏదైనా రిజిస్ట్రేషన్ ఆపాల్సి వస్తే రాత పూర్వకంగా కారణాలను తెలియజేయాలని అన్నారు. రిజిస్ట్రేషన్ యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకునే వారి ఐడెంటిటీ గుర్తించిన తర్వాతే రిజిస్టేషన్ చేయాలని అన్నారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఖమ్మం, కల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఆక్రమణకు గురైన ప్రైమ్ ల్యాండ్స్ ను ఎటువంటి నోటీసులు జారీ చేయకుండా వెంటనే ప్రభుత్వం స్వాధీనంలోకి తీసుకోవాలని అన్నారు. మండలాల వారీగా ఉన్న ప్రభుత్వ భూముల వివరాలు, ఎంత భూమి ఆక్రమణకు గురైంది, ఎవరు ఆక్రమించారు, దానికి గల కారణాలు, ప్రస్తుత స్థితిగతులు మొదలగు అంశాలపై నివేదిక అందించాలని అన్నారు. ప్రభుత్వం ఎంత భూమి పంపిణీ చేసింది, సంబంధిత లబ్దిదారుల దగ్గర ఇప్పుడు ఎంత ఉంది వంటి వివరాలను సేకరించాలని అన్నారు. ప్రభుత్వ భూ ఆక్రమణదారులలో తక్కువ భూమి ఆక్రమించిన పేదలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఎవరైనా ఉంటే వారి ఆర్థిక స్థితిగతులను నివేదికలో పొందుపర్చాలని అన్నారు. ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న ప్రైమ్ ల్యాండ్స్ కు వెంటనే ఫెన్సింగ్ వేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ముఖ్యమంత్రి కార్యాలయం, మంత్రుల దగ్గర నుంచి ప్రధాన కార్యాలయం నుండి మనకు వచ్చిన దరఖాస్తులపై తీసుకున్న చర్యలు గురించి వివరాలను తెలియ జేయాలని, తీసుకున్న చర్యలు వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఒకే రకమైన దరఖాస్తుతో ప్రజలు పలు మార్లు కార్యాలయానికి వచ్చే అవకాశం ఉండవద్దని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, ఖమ్మం, కల్లూరు రెవెన్యూ డివిజన్ అధికారులు నర్సింహారావు, రాజేందర్, తహశీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వారసంతను ఆది వరహాస్వామి రోడ్డుకు మార్చండి

### ఎంపీడీవో కు వినతి పత్రం అందజేత



**కమాన్ పూర్ యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20:** కమాన్పూర్ మండల కేంద్రంలోని శుక్రవారం జరిగే వారసంతను శ్రీ ఆది వరహాస్వామి వెళ్లే రోడ్డుకు మార్చాలని టిఆర్ఎస్ నాయకులు శుక్రవారం స్థానిక ఎంపీడీవో జి లలితకు వినతి పత్రం అందజేశారు. గతంలో కేవలం చిన్నగా ఉన్న సంత నేడు ప్రధాన రోడ్లపై పూర్తిగా విస్తరించిందని దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని వినతి పత్రంలో పేర్కొన్నారు. బస్సులు మరియు ఇతర ఇతర వాహనాలు వచ్చిన సమయంలో ప్రమాదాలు జరిగే జరిగేందుకు ఆస్కారం ఉందని వినతి పత్రంలో పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్కు సైతం వినతిపత్రం అందజేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్ మండల యువత అధ్యక్షుడు బొమ్మ గాని అనిల్ గౌడ్ మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీ మల్లు, జూలపల్లి మాజీ ఉపసర్పంచ్ పోల్దాసరి సాయికుమార్, తోట రాజ్ కుమార్, ఎలా బోయిన రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## 'ఇద్దరికీ హెల్మెట్ ఉండాల్సిందే'

### పోలీసులకు హైకోర్టు కీలక ఆదేశాలు




**అమరావతి,యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20:** రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. హెల్మెట్ లేకుండా డ్రైవ్ చేయడం వల్ల జూన్ నుంచి సెప్టెంబరు వరకు 667 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈ విషయం పై హైకోర్టు సీరియస్ అయింది. హెల్మెట్ ధరించడం తప్పనిసరి చేయాలని తాము ఇచ్చిన ఆదేశాలను పోలీసులు ఎందుకు లైట్ తీసుకుంటున్నారని హైకోర్టు ప్రశ్నించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ నేతృత్వంలోని ధర్మాసనం పోలీసులు కఠినంగా వ్యవహరించాలని ఆదేశించింది. పోలీసులు నేరుగా రోడ్లపై ఉంటే నేరాల సంఖ్య కూడా తగ్గుతుందని అభిప్రాయపడింది. సీసీ కెమెరాలు చూసి చర్యలు తీసుకునే విధానం తగ్గించి నేరుగా రోడ్లపైనే పోలీసులు నిలబడి చలాన్లు వసూలు చేయాలని సూచించింది. రాష్ట్రంలో 99 శాతం మంది హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్నారని.. ఇది ఎంత మాత్రం క్షేమం కాదని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. వాహనాలు నడిపే వ్యక్తి కాకుండా వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలని హైకోర్టు ఆదేశించింది. కొందరు సంవత్సరాలుగా చలాన్లు కట్టలేదని వారిపై సెక్షన్ 167, సెక్షన్ 206 ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. వారి వాహనాలను సీజ్ చేసి లైసెన్స్ రద్దు చేయాలని ఆదేశించింది. ఒక్క హెల్మెట్ విషయమే కాకుండా ఆటోల్లో కూడా పరిమితికి మించి జనాలు ఎక్కిస్తున్న పోలీసులు పట్టించుకోవడం లేదని మండిపడింది. ఇలాంటి చట్ట విరుద్ధమైన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రచార మాధ్యమాల్లో యాడ్లు, సైన్‌బోర్డుల ద్వారా విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పింది. చలాన్లు ఎలా వేస్తున్నారు? ఎలా వసూలు చేస్తున్నారు? చట్టం కఠినంగా అమలు చేయడానికి తీసుకున్న చర్యలేంటి? రోడ్లపై తనిఖీలకు ఏర్పాటు చేసిన టీం లు ఎన్ని? అన్ని వివరాలతో అఫిడవిట్ వేయాలని పోలీసులను ఆదేశించింది. అనంతరం విచారణకు మూడు వారాలు వాయిదా వేసింది.

# మంచుదెబ్బకు మామిడి పూత ఎఫెక్ట్



**నిజామాబాద్, యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20:** రాష్ట్రంలో అత్యల్ప ఉష్ణోగ్రతలతో మామిడి పూత కోతకు గురవుతుంది. దేశంలోని మామిడి ఉత్పత్తిలో రెండో స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో మంచు ప్రభావం రైతులపై పడుతోంది. ప్రస్తుతం మామిడి తోటలను మంచు దుప్పటి కప్పేస్తోంది. రాత్రి వేళల్లో కురుస్తున్న మంచుతో మామిడి పూతపై తీవ్ర ప్రభావం చూపుతోంది.రాష్ట్రంలోని మెట్ట ప్రాంతాల్లో మామిడి పంట సాగు అవుతోంది. సాగు విస్తీర్ణంలోనూ, దిగుబడిలోనూ దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ కంటే ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో ఉంటుంది. ఏపీ తరువాత స్థానాల్లో కర్ణాటక, తెలంగాణ, బీహార్, గుజరాత్ రాష్ట్రాలు ఉన్నాయి. అయితే రాష్ట్రంలో ప్రతి ఏటా మారుతున్న పరిస్థితులతో పాటు వాతావరణ అననుకూలత కారణంగా దిగుబడి తగ్గుతోంది. ప్రస్తుత లెక్కల ప్రకారం దేశ మామిడి ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ 16.07 శాతం ఉత్పత్తి అవుతోంది. తెలంగాణ నుంచి కేవలం 8.54 శాతం మామిడి ఉత్పత్తే వస్తోంది. అదే ఉత్తరప్రదేశ్‌లో అయితే 23.06 శాతం మామిడి ఉత్పత్తి వస్తోంది.ఏపీ ఉద్యానశాఖ లెక్కల ప్రకారం రాష్ట్రంలో 4.03 లక్షల హెక్టార్లలో మామిడి పంట సాగులో ఉంది. దాని నుంచి 59.06 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి దిగుబడి జరుగుతోంది. రాష్ట్రంలో ఉద్యానవనం పరిధిలో వచ్చే అరటి తరువాత అత్యధిక దిగుబడి వచ్చే పంట మామిడే నిలిచింది. ఇటీవలి రాష్ట్ర ప్రభుత్వం మామిడి పంటకు కూడా బీమా అమలు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బీమా వర్తింప చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది.2024-25, 2025-26 సంవత్సరాల్లో పునర్వ్యవస్థీకరణ తర్వాత వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్) అమలుకు ప్రభుత్వం పరిపాలనాపరమైన ఆమోదం తెలిపింది. ఖరీఫ్ సీజన్‌లో ఏడు పంటలు, రబీ సీజన్‌లో రెండు పంటలను ఈ బీమా కవర్ చేస్తుంది. రబీ సీజన్‌లో మామిడిని అదనపు పంటగా చేర్చడానికి పథకాన్ని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మామిడి పంటకు పథకం అమలుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను నిర్దేశించిన విధానం ప్రకారం పూర్తి చేయాలని సూచించింది.అయితే సాధారణంగా రెండు విడతల్లో మామిడి పూత వస్తుంది. డిసెంబర్, జనవరి మధ్య పూత వచ్చి ఆ తరువాత పిందెలు రావాల్సి ఉంటుంది. ఈ సంవత్సరం ఇప్పటి వరకు ఎక్కడా పూత కనిపించడం లేదు. మొక్క తోటల్లో మాత్రమే అక్కడక్కడ పూత కనిపిస్తోంది. ఇది ఒకటి నుంచి రెండు శాతం కంటే ఎక్కువ ఉండదని రైతులు చెబుతున్నారు. మొదటి విడతలో పూత కనిపించకపోయినా వాతావరణంలో వచ్చే మార్పుతో రెండో విడతలో పూత విచ్చుకునే అవకాశం ఉందని ఉద్యాన శాఖ అధికారులు తెలుపుతున్నారు. చీడపీడలను నివారించి, మేలైన యాజమాన్య పద్ధతులు చేపడితే నాణ్యతగల మంచి దిగుబడి అభిస్తాయని ఉద్యానవన యూనివర్శిటీ అధ్యపకులు తెలిపారు.రాష్ట్రంలో ప్రధానంగా బంగినపల్లి, రసాలు, కొత్తపల్లి కొబ్బరి, సువర్ణరేఖ, తోతపూడి (కలెక్టర్), పందూరి మామిడి, ముంతమామిడి తదితర రకాల మామిడి పంట రైతులు పండిస్తున్నారు. కొత్తపల్లి కొబ్బరి, పందూరి మామిడి పండ్లుకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. తోతపూడి రకం మామిడ పండ్లను జ్యూస్ తయారు చేసే కార్పొరేట్ కంపెనీలు సేకరిస్తుంటాయి. మామిడి తాండ్ర తయారీలోనూ కూడా అధికంగా వినియోగిస్తారు. ఇప్పటికే రైతులు చీడల నివారణకు అధిక మొత్తంలో ఖర్చు చేస్తున్నారు. కొంత మంది చిన్న, సన్నకారు మామిడి రైతులు గిట్టుబాటు రాక తోటలను ఎకరా రూ.12 వేల నుంచి రూ.15 వేలకు కౌలుకు ఇచ్చేస్తున్నారు. పూత కోత, చీడల నివారణకు ఉద్యానవన అధికారులను సంప్రదించి, వారు చెప్పిన పురుగు మందులను వాడాల్సి ఉంటుంది. అప్పుడే పూత కోత నివారణను, చీడల నివారణను అరికట్టగలుగుతారు.

మహిళా సంఘాల పనితీరు మెరుగుపరిచేందుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో స్వశక్తి మహిళా సంఘాల పై సంబంధిత అధికారులతో నిర్వహించిన రివ్యూ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పెద్దపెల్లి జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి 9102 మహిళా సంఘాలకు సుమారు 478 కోట్ల రుణాల మంజూరు చేయడం లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 3898 సంఘాలకు 322 కోట్ల 68 లక్షలు మంజూరు చేయడం

నెలల కాలంలో పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, గ్రేడింగ్ ఈ ఉన్న స్వశక్తి మహిళా సంఘాల పై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిని బి, లేదా ఏ గ్రేడింగ్ వచ్చే విధంగా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని మహిళా సంఘాలలో నూతనంగా మహిళలను జాయిన్ చేయాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. స్త్రీ నిధి రుణాల రికవరీ పై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద గ్రౌండ్ చేసిన యూనిట్లు లాభదాయకంగా నడిచేలా వారికి అవసరమైన సహాయ సహకారాలు అందజేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, అడిషనల్ డి ఆర్ డి ఓ రవికుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అడవిలో పలు అరుదైన పక్షులు పర్యటకులను కనువిందు చేశాయి.కవ్వాల్ టైగర్ జోన్లోని జన్నారం అటవీ డివిజన్లో పక్షులు ఆవాసాలు ఏర్పాటు చేసుకుని చూపరులను ఆకట్టుకుంటున్నాయి. పక్షి ప్రేమికులు వాటిని తిలకించేందుకు అటవీశాఖ అధికారులు బర్డ్ వాక్ పేరిట అవకాశం కల్పిస్తున్నారు. రెండేళ్లుగా ఫిబ్రవరిలో బర్డ్వాక్ నిర్వహించగా వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి అనేక మంది పక్షి ప్రేమికులు వచ్చి పక్షులను తమ కెమె రాల్లో బంధించు కుంటున్నారు.జన్నారం అటవీ డివిజన్ లోని కల్పకుంట, బైసన్ కుంట, మైసమ్మకుంట, తదితర ప్రాంతాల్లోని అడవుల్లో వివిధ రకాల పక్షులు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. విదే శాల నుంచి వచ్చిన పక్షులు కూడా ఇక్కడ కనిపి స్తాయి. ఎప్పుడూ చూడని అరుదైన పక్షులకు ఆవాసంగా జన్నారం అటవీ డివిజన్ ఉంది. అధి కారులు, సిబ్బంది పక్షుల రకాలు, వాటి శాస్త్రీయ నామాలు, వివరాలు తెలుసుకునేందుకు తగిన చర్యలు తీసుకున్నారు. అప్పటి నుంచి కవ్వాల్ టైగర్ జోన్లోని జన్నారం అటవీ డివిజన్ ను పక్షు లకు కూడా ఆవాసంగా గుర్తించారు.రెడ్ రీసెల్డ్ ల్యాప్ విగ్, వైట్ ఐ బెజార్డ్, ఫైడ్ కింగ్ ఫిషర్, వైట్ త్రోటెడ్ కింగ్ ఫిషర్ వంటి పక్షులు కనిపించాయని అధికారులు అటవీ శాఖ అధికారులు తెలిపారు.కావ్వాల్ లో పక్షులను చూసేందుకు

తమ కెమెరాల్లో బంధించేందుకు ఫోటోగ్రాఫర్లు అధిక సంఖ్యలో వస్తున్నందున అటవీ శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నారు. పక్షులని తమ కెమెరా లో బందించేందుకు తదితర ప్రాంతాల నుండి మహారాష్ట్ర, కాకినాడ, హైదరాబాద్, వరం గల్, కరీంనగర్, తదితర ప్రాంతాల నుంచి పక్షి ప్రేమికులు, ఫోటోగ్రాఫర్లు వచ్చి తమ కెమెరా లో బందిస్తున్నారు. రాత్రి అక్కడే ఉండి ఉదయం పక్షులను తిలకించే వీలు కల్పిస్తు న్నారు. ఉదయం బర్డ్వాక్ చేసు కునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం సమావేశం ఏర్పాటు చేసి వారి అనుభవాలను తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా అడవుల్లో రెడ్ రీసెల్డ్ ల్యాప్ విగ్, వైట్ ఐ బెజార్డ్, ఫైడ్ కింగ్ ఫిషర్, వైట్ త్రోటెడ్ కింగ్ ఫిషర్ వంటి పక్షులు కనిపించాయని కవ్వాల్ పర్యాటకులను ఆకర్షిస్తోందని అధికారులు తెలిపారు.బర్డ్వాకా ఫెస్టివల్ కు వచ్చే ప్రకృతి ప్రేమికులకు అటవీశాఖ అధికారులు మంచి ఆతిథ్యం ఇస్తున్నారు. నేచర్ ఎంజాయ్ చేసే విధంగా వచ్చిన వారికి జన్నారం అటవీ డివిజన్ లోని బైనన్ కుంట, ఇండన్ పల్లి రేంజ్ లోని బర్డ్నేట్ బేస్ క్యాంప్లలో డేరాలు ఏర్పాటు చేసి అందులో బస చేసే విధంగా ఏర్పాట్లు చేయనున్నారు

# కమతం రాఘవయ్య ఆశయాలను సాధిద్దాం: బోల్లు ప్రసాద్



**సూర్యాపేట యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20:** కోదాడ ప్రాంత సిపిఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ కమతం రాఘవయ్య ఆశయాలను సాధిద్దామని జిల్లా రైతు సంఘం నాయకులు బొల్లు ప్రసాద్ కోదాడ ప్రాంత సిపిఐ సీనియర్ నాయకులు పోతురాజు సత్యనారాయణ అన్నారు. కమతం రాఘవయ్య 34 వర్ధంతి సందర్భంగా పట్టణంలోని స్థానిక తమ్మరబండ పాలెంలో ఉన్న రాఘవయ్య స్తూపానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా సిపిఐ జెండాను పోతురాజు సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొల్లు ప్రసాద్ మాట్లాడుతూ, కమతం రాఘవయ్య కోదాడ ప్రాంతంలో, తమ్మరబండ పాలెం లో కమ్యూనిస్టు పార్టీబలోపేతానికి ఎనలేని కృషి చేశారని, కోదాడ ప్రాంతంలో ఎంతో మంది నాయకులను కార్యకర్తల ను సిపిఐ సైనికులుగా తయారు చేశారని కొనియాడారు. పార్టీకి చేసిన సేవ మరువలేనిది అన్నారు. నేటి యువత రాఘవయ్య గారి ఆశయాలను సాధించిన నాడే మనం ఆయనకు ఇచ్చే ఘన నివాళు లు అని తెలిపారు. తమ్మర సిపిఐ శాఖ కార్యదర్శి మాతంగి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పోతురాజు సత్యనారాయణ ,బొల్లు ప్రసాదు, కొండ కోటేశ్వరరావు నిడిగొండ రామకృష్ణ ,కమతం పుల్లయ్య, పసుపులేటి గోవిందరావు, కమతం సైదయ్య ,మల్లారెడ్డిగూడెం బాబు ,మాతంగి ఏసు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలపై చర్చ జరగాల్సిందే.. తలసాని శ్రీనివాస్‌యాదవ్

**హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20:** అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నో అలవికాని హామీలు ఇచ్చిందని, ఇప్పుడు ఆ హామీలను నెరవేర్చడంలో విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. ఆ హామీలపై చర్చ పెట్టాలని తాము కోరామని తెలిపారు. ఇవాళ ఉదయం శాసనసభ సమావేశాల ప్రారంభానికి ముందు మీడియా పాయింట్‌లో తలసాని మాట్లాడారు. ఫార్ములా వన్ రేసు సందర్భంగా అవినీతి జరిగిందంటూ తమ నాయకుడు కేటీఆర్‌పై కేసు పెట్టారని, ఫార్ములా వన్‌పై చర్చ జరగాలని తాము డిమాండ్ చేస్తున్నామని తలసాని వెల్లడించారు. శాసనసభలోతమ దళిత ఎమ్మెల్యేలకు చెప్పులు చూపించారని ఆయన ఆరోపించారు. సభ రికార్డులు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. తాము



## న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు




**రామడుగు, యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20:** రామడుగు మండలం వేదిర గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీనియర్ సివిల్ జడ్జి మరియు జిల్లా న్యాయ సేవధికార ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు శుక్రవారం నిర్వహించారు. న్యాయ సేవాధికార వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశలో ముఖ్యంగా క్రమశిక్షణ అలవర్చుకోవాలని క్రమశిక్షణ ఉంటేనే భవిష్యత్తు బాగుంటుందని వారు తెలిపారు. విద్యార్థి దశ నుండి జీవితంలో స్థిరపడే వరకు ఏదో ఒక చట్టానికి అనుగుణంగా నడుచుకోవాల్సి వస్తుందని కాబట్టి విద్యార్థులు వివిధ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని వారన్నారు. ఈ సందర్భంగా ర్యాగింగ్ నిర్మూలన చట్టం మాదకద్రవ్యాల నిర్మూలన ఫోకస్ చట్టం మరియు సైబర్ మోసాల నుంచి ఏ విధంగా జాగ్రత్తపడాలో అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలలోని వంటగది మరియు ఆహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలాంటి న్యాయపరమైన లేదా న్యాయ సేవ అవసరమైన సంప్రదించవలసినదిగా పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే వెంకటేష్ తో పాటు జిల్లా లీగల్ ఎడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ తణుకు మహేష్ పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కోతుల దాడిలో తీవ్రంగా గాయపడిన మహిళ



**కొత్తగూడెం, యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20 :** కోతుల దాడిలో మహిళ తీవ్రంగా గాయపడిన ఘటన మహబూబాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ వాసులు ద్విచక్ర వాహనంపై మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మీదుగా వరంగల్ వెళుతుండగా కొత్తగూడ మండలం గాదేవాగు దగ్గర కోతులు ఒక్కసారిగా దాడి చేశాయి. ఒక్కసారిగా బైక్ బ్రేక్ వేయడంతో మద్దెల నాగమణి వెనుక వైపు తిరిగి పడటంతో తలకు గాయం అయి తీవ్ర రక్తస్రావం కావడంతో 108 వాహనానికి సమాచారం ఇచ్చి మహిళను అంబులెన్స్ లో చికిత్స నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కొరకు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మండలంలోని కోతుల బెడద రోజు రోజుకి పెరిగిపోతుంది. అడవులను విడిచి గ్రామీణ ప్రాంతాల్లోకి ప్రవేశిస్తున్నాయి. గ్రామాలను కోతుల ఆవాసాలుగా మార్చుకుంటున్నాయి. ఆకలితో అలమటిస్తూ వాహన దారుల పై దాడులు చేసి వారిని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. పంట పొలాలకు నాశనం చేసి రైతులకు తీవ్ర నష్టాలను తెచ్చి పెడుతున్నాయి అంటూ మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

## ఐకేపీ సెంటర్లలో భారీగా చోరీలు..



**పెంట్లవెల్లి, యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20 :** ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాల్లో కమిషన్ ఇస్తేనే ధాన్యాన్ని కాంట చేస్తున్నారని ఐకేపీ మహిళా సంఘాలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెంట్లవెల్లి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ దగ్గర ధాన్యం వచ్చి పది రోజులైనా కాంటాలు చేయడం లేదని ఎవరు కమిషన్ ఇస్తే వాళ్లకి మాత్రమే ముందుగా కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు, అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం తేమశాతం 17% మ్యాచ్ వస్తే కొనుగోలు చేయాలని చెప్పగా, ఐకేపీ సెంటర్ల ద్వారా మహిళా సంఘాలు మాత్రం 14% నిర్వహించి రైతుల నోట్లో మన్ను కొడుతున్నారని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు మాత్రం చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని,అధికారులకు కూడా కమిషన్ ముడుతుందేమని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# జహీరాబాద్ లో ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఏర్పాటుకు కృషి

**- నిరుద్యోగ నిర్మూలనకు ప్రత్యేక కార్యచరణ**

**- మొదటి ప్రధాన్యత ఓటు వేసిభారీ మెజారిటీ తో గెలిపించండి**




**జహిరాబాద్, యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20 :** పారిశ్రామిక ప్రాంతమైన జహీరాబాద్ పట్టణ కేంద్రంలో ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని కరీంనగర్- అదిలాబాద్ నిజామాబాద్ -మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు.. శుక్రవారం జహీరాబాద్ పట్టణ కేంద్రంలో పలువురు పట్టభద్రులను కలిసి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు



మద్దతు తెలుపాలని కోరారు.. అనంతరం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు... ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీ టు పీజీ వరకు అన్ని రంగాలపై అవగాహన ఉన్న తనను రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో భారీ మెజారిటీ తో గెలిపించాలని కోరారు... విద్యారంగాన్ని బలోపేతం



చేసేందుకు కృషి చేస్తానని వెల్లడించారు.. విద్యారంగం నుండి వచ్చిన తనకు ఉద్యోగ నిరుద్యోగ పట్టభద్రుల సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉందని.. నిరుద్యోగ నిర్మూలనకు ఒక ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళుతున్నానని వెల్లడించారు...గతంలో గెలిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీలు నిరుద్యోగుల సమస్యలు పట్టించుకో లేదని ఆవేదన వ్యక్తం చేశారు... వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో చాలావరకు ఖాళీగా ఉన్నాయని వాటిని భర్తీ చేసేందుకు కృషి చేస్తానని అన్నారు.. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టో లో పెట్టిన జాబ్ క్యాలెండర్ అమలుకు కృషి చేస్తానని అన్నారు... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన సంవత్సర కాలంలోనే 50వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తు చేశారు.. ఉస్మానియా విశ్వవిద్యాలయం కింద ప్రభుత్వ కళాశాలలో పరీక్ష ఫీజులు వసూలు చేయడం బాధాకరమని అన్నారు.. గురుకుల, మోడల్, కేజిబివి లలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు హెల్త్ కార్డుల మంజూరుకై కృషి చేస్తానని అన్నారు.. ప్రభుత్వ గురుకులాలలో కీచన్, మెస్,కేర్ టేకర్ సిస్టం నుసఫరెట్ వ్యవస్థ ను ఏర్పాటు చేయాలనిఅన్నారు.. గత 11 రోజులుగా సర్వ శిక్ష అభియాన్ తమ న్యాయమైన డిమాండ్ల కోసం రిలే నిరాహారదీక్షలు చేస్తున్నారని.. త్వరలోనే వారికి ప్రభుత్వం శుభవార్త చెబుతుందని ఆశాభవం వ్యక్తం చేశారు... 317 జీవో ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం వెంటనే వారి స్థానికతను బట్టి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు.. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమా న్యాలు ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల కాక ఇబ్బందులను ఎదుర్కొం టున్నారని ప్రభుత్వంతో మాట్లాడి వారి సమస్యను పరిష్కరిస్తానని అన్నారు..

## రామగుండం వీటీసీ 2 నందు యోగా కార్యక్రమాలు



**కమాన్ పూర్ యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20:** సింగరేణి సంస్థ ఆర్.జి 2 పరిధిలోని వృత్తి శిక్షణ కేంద్రంలో యోగా శిక్షణ ఏర్పాటు చేయడం జరిగిందని అధికారులు తెలిపారు. వృత్తి శిక్షణా కేంద్రమునకు వచ్చే శిక్షణార్థులకు విటిసి మేనేజర్ మురళీకృష్ణ ప్రత్యేకంగా యోగాసనాలు ధ్యానంపై శిక్షణ ఏర్పాటు చేస్తున్నారు .ధ్యానం మరియు యోగాసనా ల ద్వారా శిక్షణార్థులు మానసికంగా శారీరకంగా పటిష్ట స్థితిని ఏర్పరచుకొని మనసును ఏకాగ్రత సాధించుకొని గనులలో పూర్తిస్థాయి లో పనిచేయుట కొరకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేస్తున్నారు. దీనికిగాను యోగా గురువు బాలయ్య ద్వారా సింగరేణి సంస్థ అర్జీ 2 వీటీసీకి నూతనంగా వచ్చే శిక్షణార్థులందరికీ యోగా కార్యక్రమాలు ఏర్పాటు చేయడమైనది. ఈ కార్యక్రమానికి ఇన్స్ట్రక్టర్స్ మహేష్ కిషోర్ సతీష్ మరియు సీనియర్ అసిస్టెంట్ తిరుపతి సహకరిస్తూ శిక్షణార్థులు పూర్తిస్థాయిలో శిక్షణ తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నారు

## ఖమ్మం కమిషనరేట్ లో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ గా భాధ్యతలు స్వీకరించిన చంద్రకళ



**ఖమ్మం, యదార్థవాది ప్రతినిధి, డిసెంబర్ 20 :** పోలీస్ కమిషనర్ కార్యాలయం ఏవో (అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్) గా బి.చంద్రకళ శుక్రవారం భాధ్యతలు స్వీకరించారు. ఆనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వరంగల్ కమిషనరేట్ సెక్షన్ సూపరిండెంట్ గా భాధ్యతలు నిర్వహిస్తూ...ఏవో గా పదోన్నతిపై ఖమ్మం పోలీస్ కమిషనరెట్ కు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఈ రోజు ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో భాధ్యతలు చేపట్టారు. ఆనంతరం అడిషనల్ డీసీపీ ఆడ్మీన్ నరేష్ కుమార్, అడిషనల్ డీసీపీ లా, ఆర్డర్ ప్రసాద్ రావు ని మర్యాద పూర్వకంగా కలిశారు.

అండర్ 19 మహిళల ఆసియా కప్ టీ20 టోర్నీలో భారత్ ఫైనల్ చేరింది. శుక్రవారం ఆతిథ్య శ్రీలంకతో జరిగిన సూపర్-4 చివరి మ్యాచ్‌లో భారత్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తెలుగు తేజం గొంగడి త్రిష(24 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 32)దూకుడుగా ఆడి భారత విజయంలో కీలక పాత్ర పోషించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక అండర్ 19 మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 98 పరుగులే చేసింది. భారత బౌలర్లలో ఆయుషి శుక్లా(4/10) నాలుగు వికెట్లతో సత్తా చాటగా.. షబ్నమ్ షకిల్, ద్రితీ కేసరి తలో వికెట్ తీసారు. అనంతరం భారత మహిళల జట్టు త్రిష సూపర్ బ్యాటింగ్‌తో 14.5 ఓవర్లలోనే 6 వికెట్లకు 102 పరుగులు చేసి గెలుపొందింది. త్రిషతో పాటు కమలిని(26 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 28) రాణించింది. ఈ గెలుపుతో మూడు విజయాలు, ఒక డ్రాతో సూపర్-4 పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానంలో నిలిచిన భారత్.. ఫైనల్‌కు అర్హత సాధించింది. మూడు విజయాలు ఒక ఓటమితో రెండో స్థానంలో నిలిచిన బంగ్లాదేశ్‌తో భారత్ ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. ఆదివారం కౌలలాంపుర్ వేదికగా ఈ ఫైనల్ మ్యాచ్ జరగనుంది.



భారత్‌తో జరుగుతున్న ఐదు టెస్టుల బోర్డర్ -గావస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియాకు ఎదురు దెబ్బ తగిలింది. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో గెలిచి సిరీస్ సాధించాలనుకున్న ఆసీస్‌కు షాక్ తగిలింది. గాయంతో స్టార్ పేసర్ జోష్ హేజిల్ వుడ్ మిగతా రెండు టెస్టులకు దూరమయ్యాడు. ఇప్పటికే వెన్ను నొప్పితో అడిలైడ్‌లో జరిగిన రెండో టెస్టుకు దూరమైన హేజిల్ వుడ్.. తాజాగా కాలి గాయంతో నాలుగు, ఐదు టెస్టులకు దూరమైనట్లు క్రికెట్ ఆస్ట్రేలియా ప్రకటించింది. నిజానికి మూడో టెస్టులో ఆడిన హేజిల్ వుడ్ కాలికి గాయం కావడంతో మ్యాచ్ మధ్యలోనే దాదాపుగా వైదొలిగాడు. ముందు జాగ్రత్తగా అతడిని వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించి, వివిధ పరీక్షలు నిర్వహించింది. నిజానికి హేజిల్ వుడ్‌కు అయిన గాయం చిన్నదేనని స్కానింగ్‌లో తేలింది. అయితే రెండు వారాలు విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు సూచించడంతో ఈ రెండు టెస్టులకు అతడిని జట్టులో నుంచి తప్పించింది. మరోవైపు కీలక సమయంలో గాయాలబారిన పడుతుండటంపై హేజిల్ వుడ్ ఆవేదన వ్యక్తం చేశాడు. రెండో టెస్టులో అనుకోకుండా వెన్నునొప్పికి గురయ్యాయని, ప్రస్తుతం కాలి పిక్కకు గాయం అయిందని వెల్లడించాడు. అయితే వెన్నునొప్పి నుంచి కోలుకుని, తిరిగి జాతీయ జట్టుకు ఆడాలని తీవ్రంగా శ్రమించానని, అయితే ఇప్పుడిలా మళ్లీ జట్టుకు గాయం కారణంగా దూరం కావడం బాధకరంగా ఉందని ఉద్వేగానికి లోనయ్యాడు. గత నాలుగేళ్లుగా గాయాల కారణంగా జట్టులోకి రావడం పోవడం జరుగుతోందని హేజిల్ వుడ్ ఆవేదన చెందుతున్నాడు. వెన్నునొప్పి, కాలి పిక్క గాయం లాంటి చిన్నగాయాలవుతున్నాయని, అయితే కీలక సమయంలో వీటి కారణంగా జట్టుకు దూరం కావాల్సి వస్తోందని పేర్కొన్నాడు. మరోవైపు ఫిట్ నెస్ పెంచుకునేందుకు జిమ్‌లో కసరత్తులు చేస్తున్నా, లక్కు కలిసి రావడం లేదని, గాయాలపాలు కావడం మానడం లేదని వ్యాఖ్యానించాడు. కచ్చితత్వంతో బౌలింగ్ చేస్తాడని 33 ఏళ్ల హేజిల్ వుడ్‌కు చాలా మంచి పేరుంది. నిజానికి బ్రిస్బేన్‌లో జరిగిన మూడో టెస్టులో కేవలం ఆరు ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేసినప్పటికీ, సరైన లైన్ అండ్ లెంగ్త్ , కచ్చితత్వంతో భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని ఇబ్బంది పెట్టి, వికెట్ సాధించాడు. అయితే ఆ తర్వాత కాసేపటికి కాలి పిక్క గాయంతో తను పెవిలియన్‌కు చేరాడు. మరోవైపు బీజీటీ సిరీస్ రసపట్టులో ఉంది. ఇప్పటివరకు జరిగిన మూడు మ్యాచ్‌ల్లో ఇరు జట్లు చెరో మ్యాచ్ గెలవగా, మరో మ్యాచ్ డ్రాగా ముగిసింది. దీంతో నాలుగో టెస్టు బాక్సింగ్ డే రోజున అంటే డిసెంబర్ 26న మెల్ బోర్న్‌లో జరుగుతుంది. ఇక గాయానికి గురైన హేజిల్ వుడ్ స్థానంలో పేసర్ స్కాట్ బోలాండ్‌ను జట్టులోకి తీసుకునే అవకాశముంది. రెండోటెస్టులోనూ హేజిల్ వుడ్ స్థానంలో తను బౌలింగ్ చేశాడు. ఆ మ్యాచ్‌లో ఐదు వికెట్లతో సత్తా చాటాడు.

# ఆర్‌సీబీ కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ

## వరుసగా మూడు వన్డేల సిరీస్‌ను గెలుచుకున్న తొలి జట్టుగా రికార్డ్



అంతర్జాతీయ వన్డేల్లో పాకిస్థాన్ క్రికెట్ టీమ్ చరిత్ర సృష్టించింది. 21వ శతాబ్దంలో సౌతాఫ్రికా గడ్డపై వరుసగా మూడు వన్డేల సిరీస్‌ను గెలుచుకున్న తొలి జట్టుగా రికార్డ్ సాధించింది. సౌతాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో 81 పరుగుల తేడాతో విజయం సాధించిన పాకిస్థాన్ మరో మ్యాచ్ మిగిలి ఉండగానే మూడు వన్డేల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. సఫారీ గడ్డపై పాకిస్థాన్‌కు ఇది వరుసగా మూడో వన్డే సిరీస్ విజయం. ఆ జట్టు 2013, 2021లో సిరీస్‌లను కైవసం చేసుకుంది. 7 పర్యటనలో పాకిస్థాన్ మూడు సార్లు వన్డే సిరీస్ గెలిచింది. పాకిస్థాన్ తర్వాత ఆస్ట్రేలియా 10 పర్యటనల్లో మూడు సార్లు సౌతాఫ్రికా గడ్డపై వన్డే సిరీస్ కైవసం చేసుకుంది. వచ్చే ఏడాది సొంతగడ్డపై జరగనున్న ఛాంపియన్స్ ట్రోఫీ 2025కి ముందు ఈ సిరీస్ విజయం పాకిస్థాన్ ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేయనుంది. హైబ్రిడ్ మోడల్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ జరగనున్న విషయం తెలిసిందే. భారత మ్యాచ్‌లు దుబాయ్ వేదికగా జరగనున్నాయి. చివరిసారిగా జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ 2017లో పాకిస్థాన్ విజేతగా నిలిచింది. ఫైనల్లో భారత్‌ను ఆ జట్టు ఓడించింది. ఈ సిరీస్ విజయంపై పాక్ కెప్టెన్ మహమ్మద్ రిజ్వాన్ సంతోషం వ్యక్తం చేశాడు. 'జట్టులోని ప్రతీ ఒక్కరు రాణించారు. శుభారంభం దక్కకున్నా మాకు మంచి భాగస్వామ్యం కూడా లభించింది. నేను, బాబర్ ఆజామ్ నెమ్మదిగా ఆడి ఇన్నింగ్స్‌కు గట్టి పునాది వేసాం. 300 పరుగులు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. కానీ కమ్రాన్ గులామ్ సూపర్ బ్యాటింగ్‌తో 320 పరుగులు చేశాం. ఓ కెప్టెన్‌గా అతనిపై నాకు నమ్మకం ఉంది. కానీ ఈ రోజు అతను స్థాయికి తగ్గట్లు రాణించలేదు(నవ్వుతూ). బౌలర్లు అద్భుత ప్రదర్శన కనబర్చారు.'అని విజయానంతరం రిజ్వాన్ చెప్పుకొచ్చాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 49.5 ఓవర్లలో 329 పరుగులకు ఆలౌటైంది. మహమ్మద్ రిజ్వాన్(82 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 80), బాబర్ ఆజామ్(95 బంతుల్లో 7 ఫోర్లతో 73), కమ్రాన్ గులామ్(32 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లతో 63) హాఫ్ సెంచరీలతో రాణించారు. సౌతాఫ్రికా బౌలర్లలో క్వేనా మఫకా(4/72) నాలుగు వికెట్లు తీయగా.. మార్కో జాన్సెన్(3/71) మూడు వికెట్లు పడగొట్టాడు. ఫర్చూన్, పెహ్లుక్వాయోకు చెరో వికెట్ దక్కింది. అనంతరం సౌతాఫ్రికా 43.1 ఓవర్లలో 248 పరుగులకు కుప్పకూలింది. హెన్రీచ్ క్లాసెన్(74 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్స్‌లతో 97) తృటిలో శతకం చేజార్చుకున్నాడు. అతనికి తోడు మరే బ్యాటర్ రాణించలేదు.పాకిస్థాన్ బౌలర్లలో షాహిన్ షా అఫ్రిది(4/47) నాలుగు వికెట్లు తీయగా.. నసీమ్ షా(3/37) మూడు వికెట్లు పడగొట్టాడు. అబ్రార్ అహ్మద్(2/48)కు రెండు వికెట్లు దక్కగా.. సల్మాన్ అఘాకు ఓ వికెట్ దక్కింది. తొలి వన్డేలోనూ పాకిస్థాన్ 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. దాంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ సొంతం చేసుకుంది. ఇరు జట్ల మధ్య మూడో వన్డే ఆదివారం జరగనుంది.





మహిళా క్రికెట్లో అత్యధిక 50ం స్కోర్లు చేసిన క్రికెటర్ గా ప్రపంచ రికార్డు బద్దలు కొట్టింది. గతంలో ఈ రికార్డు న్యూజిలాండ్ కు చెందిన సుజీ బేట్స్ పేరిట ఉండేది. అలాగే ఈ మ్యాచ్ లో 77 పరుగులు చేసిన స్మృతి.. ఒక క్యాలెండర్ ఇయర్లో అత్యధిక టీ20 పరుగులు సాధించిన క్రికెటర్ గా రికార్డులకెక్కింది. తాజా ఇన్నింగ్స్ తో ఈ ఏడాది 21 ఇన్నింగ్స్‌లో 763 పరుగులు సాధించింది. గతంలో ఈ రికార్డు చమరి ఆటపట్టు (21 ఇన్నింగ్స్-720 పరుగులు) పేరిట ఉండేది. తాజా ఘనతలతో ఈ ఏడాది టీ20 క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు గట్టి పోటీగా నిలిచింది. ఇక ఈ మ్యాచ్ లో స్టాండిన్ కెప్టెన్ గా ఆడిన స్మృతి.. జట్టును విజయతీరాలకు చేర్చింది. దీంతో మూడు టీ20ల సిరీస్ ను 2-1తో భారత్ గెలుచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 217/4తో భారీ స్కోరు సాధించింది. ఈ ఫార్మాట్లో భారత్ కిదే అత్యధిక స్కోరు కావడం విశేషం. అలాగే ఈ సిరీస్ లో మంధానకిది వరుసగా మూడో అర్ధ సెంచరీ కావడం గమనార్హం. అనంతరం చేజింగ్ విండీస్ ఓవర్లన్నీ ఆడి 157/7కే పరిమితమై 60 పరుగులతో ఓడిపోయింది. బ్యాటర్లో స్మృతి (47 బంతుల్లో 77, 13 ఫోర్లు, ఒక సిక్సర్) సత్తా చాటగా, రిచా ఘోష్ (21 బంతుల్లో 54, 3 ఫోర్లు, 5 సిక్సర్లు)తో వేగవంతమైన ఫిఫ్టీతో ప్రపంచ రికార్డును సమం చేసింది. కేవలం 18 బంతుల్లోనే తను అర్ధ సెంచరీ సాధించడం విశేషం. విండీస్ బ్యాటర్ల చినెల్లి హెన్రీ (43) టాప్ స్కోరర్. బౌలర్లలో రాధా యాదవ్ నాలుగు వికెట్లతో విండీస్ నడ్డి విరిచింది. రిచా ఘోష్ కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, స్మృతికి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డులు దక్కాయి.

# రెండు టెస్టులకు జట్టును ప్రకటించిన ఆసీస్

## జట్టులోకి యువ బ్యాటర్ 19 ఏళ్ల సామ్  కొన్స్టాస్

భారత జట్టుతో జరిగే చివరి రెండు టెస్టులకు ఆస్ట్రేలియా టీమ్‌ను ప్రకటించింది. 15 మందితో కూడిన ఈ జట్టులో రెండు కొత్త ముఖాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఈ సిరీస్‌లో వరుసగా విఫలమవుతున్న యువ ఓపెనర్ నాథన్ మెక్ స్వీనీకి ఉద్వాసన పలికింది. అతని స్థానంలో మరో యువ బ్యాటర్ 19 ఏళ్ల సామ్  కొన్స్టాస్‌ను జట్టులోకి తీసుకుంది. అతను ఉస్మాన్ ఖవాజాతో కలిపి ఓపెనింగ్ చేసే అవకాశముంది. ఇక పేసర్ జై రిచర్డ్సన్‌ను జట్టులోకి తీసుకుంది. దాదాపు మూడేళ్ల తర్వాత అతను జాతీయ జట్టులోకి రావడం విశేషం. కాలి పిక్క గాయంతో స్టార్ పేసర్ జోష్ హేజిల్ వుడ్ సిరీస్ మొత్తానికి దూరం కావడంతో ఆసీస్ ఈ మార్పును చేసింది. దూకుడైన ఆటతీరుకు కొన్ స్టాప్ చిరునామాలా ఉంటాడు అనడంలో ఎలాంటి సందేహం లేదు. టాపార్డర్‌లో వేగంగా ఆడగలడు. ఇక దేశవాళీల్లో టన్నుల కొద్ది పరుగులు సాధించిన అనుభవం ఉంది. షెఫీల్డ్ షీల్డు టోర్నీలో రెండు సెంచరీలు చేశాడు. టోర్నీలో న్యూ సౌత్ వేల్స్ బ్యాటింగ్‌లో కీలకంగా వ్యవహరించాడు. అలాగే భారత్, ప్రైమ్ మినిస్టర్ ఎలెవన్ జట్ల జరిగిన మ్యాచ్‌లోనూ బరిలోకి దిగాడు. ఆ మ్యాచ్‌లో మెరుపు సెంచరీ (97 బంతుల్లో 107, 14 ఫోర్లు, ఒక సిక్సర్)తో భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నాడు. అంతకు ముందు భారత్-ఎ, ఆసీస్-ఎ జట్ల మధ్య జరిగిన అనధికార రెండు టెస్టుల్లోనూ బరిలోకి దిగాడు. ఓవరాల్‌గా 92 పరుగులతో ఫర్వాలేదనిపించాడు. ముఖ్యంగా రెండో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 73 పరుగులతో ఆకట్టుకున్నాడు. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుని జాతీయ జట్టులోకి అతడిని సెలెక్టర్లు ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ సిరీస్‌లో ఘోరంగా విఫలమైన వెటరన్ ఖవాజా.. అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని అతడిని కొనసాగించినట్లు ఉన్నారు. ఇరు జట్ల మధ్య జరుగుతున్న బోర్డర్- గావస్కర్ ట్రోఫీ పోటాపోటీగా సాగుతోంది. ఇప్పటివరకు మూడు టెస్టులు జరుగగా, రెండింటిలో ఫలితం తేలగా, మూడో టెస్టు డ్రాగా ముగిసింది. 295 పరుగులతో తొలి టెస్టును భారత్ కైవసం చేసుకోగా, పది వికెట్లతో రెండో టెస్టును కంగారూలు దక్కించుకున్నారు. ఇక నాలుగో టెస్టు బాక్సింగ్ డే రోజును మెల్బోర్న్‌లో ఈ నెల 26 నుంచి జరుగుతుంది. ఆ తర్వాత ఐదో టెస్టు సిడ్నీలో జనవరి మూడు నుంచి ప్రారంభమవుతుంది. టీమిండియాతో చివరి రెండు టెస్టులకు ఆస్ట్రేలియా జట్టు పాట్ కమిన్స్ (కెప్టెన్), ట్రావిస్ హెడ్, స్టీవ్ స్మిత్, సీన్ అబాట్, స్కాట్ బోలాండ్, అలెక్స్ కెరీ, జోష్ ఇంగ్లిస్, ఉస్మాన్ ఖవాజా,సామ్ కొన్‌స్టాస్, మార్నస్ లబుషేన్, నాథన్ లియోన్, మిచెల్ మార్ష్, రిచర్డ్‌సన్, మిచెల్ స్టార్క్, బ్యూ వెబ్‌స్టర్.






# పెళ్లి తర్వాత ఇవేం పనులమ్మా కీర్తి..



సౌత్ ఇండియాలో అందం పరంగా కానీ, నటన పరంగా కానీ అద్భుతంగా రాణించి అవార్డులు, రివార్డులు అందుకున్న హీరోయిన్లు చాలా తక్కువ మంది మాత్రమే ఉన్నారు. ఆ తక్కువమందిలో ఒకరు కీర్తి సురేష్. ఈమె తల్లి మేనకా కూడా ఒకప్పుడు సినీ హీరోయినే. మలయాళం లో పెద్ద సూపర్ స్టార్. కీర్తి సురేష్ తండ్రి కూడా ఒక డైరెక్టర్. అమ్మానాన్నలు ఇద్దరు సినీ ఇండస్ట్రీ కి చెందినవాళ్లు కావడంతో కీర్తి సురేష్ బాల్యం నుండే నటించడం మొదలు పెట్టింది. బాలనటిగా పలు మలయాళం సినిమాల్లో నటించిన ఈమె, ఆ తర్వాత హీరోయిన్ గా రీ ఎంట్రీ ఇచ్చి నేడు ఈ స్థానం వరకు వచ్చింది. 'మహానటి' సావిత్రిగా అద్భుతమైన నటన కనబర్చి నేషనల్ అవార్డుని కూడా అందుకుంది. అప్పటి నుండి గ్లామర్ రోల్స్ కి దూరంగా కేవలం నటనకి ప్రాధాన్యం ఉన్న పాత్రలను మాత్రమే చేస్తూ వచ్చింది.ఇది ఇలా ఉండగా రీసెంట్ గానే ఈమె తన బాల్య స్నేహితుడు ఆంటోని ని వివాహం చేసుకుంది. ఈ పెళ్ళికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియా లో బాగా వైరల్ అయ్యాయి. చూడముచ్చటగా జంట ఉందంటూ కామెంట్స్ కూడా చేశారు. అయితే ఇప్పుడు ఈమె వివాదాల్లోకి చిక్కుకుంది. పూర్తి వివరాల్లోకి వెళ్తే బాలీవుడ్ లో ఈమె 'బేబీ జాన్' అనే చిత్రం లో హీరోయిన్ గా నటించింది. కోలీవుడ్ లో సూపర్ హిట్ గా నిల్చిన 'తేరి' చిత్రానికి ఇది రీమేక్. వరుణ్ ధావన్ హీరో గా నటించిన ఈ సినిమా, క్రిస్మస్ కానుకగా ఈ నెల 25 వ తారీఖున ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా విడుదల కాబోతుంది. ఈ సినిమాకి సంబంధించిన ప్రొమోషన్స్ లో కీర్తి సురేష్ చాలా చురుగ్గా పాల్గొంటుంది. అందులో భాగంగా ఆమె ధరించిన దుస్తులు ఇప్పుడు నేషనల్ లో సెన్సేషనల్ టాపిక్ అయ్యింది.

తన శరీరాన్ని పూర్తిగా ఎక్స్పోజ్ చేస్తూ ఎరుపు రంగు దుస్తులు ధరించిన ఈమె, మేడలో మంగళసూత్రం తో దర్శనమించింది. ఇది చూడగానే ఈమె ఏంటి ఇలా వచ్చింది. మోడరన్ డ్రెస్ లో ఇలా ఒక అమ్మాయి రావడం ఇప్పటి వరకు మేము ఎవ్వరూ చూడలేదంటూ సోషల్ మీడియా లో నెటిజెన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇలాంటి దుస్తులు వేసుకొచ్చినప్పుడు మంగళ సూత్రంని అలా అగౌరవపర్చకుండా,పైన ఏమైనా కప్పుకొని వచ్చునంటే బాగుండేది అని, చూసే ప్రేక్షకులకు ఇలా చేస్తే నచ్చదు అంటూ ఆమె అభిమానులు సైతం సోషల్ మీడియా లో కామెంట్స్ చేస్తున్నారు. మరి దీనిపై ఆమె స్పందిస్తుందా లేదా అనేది చూడాలి. ఇది ఇలా ఉండగా కీర్తి సురేష్ కి 'బేబీ జాన్' బాలీవుడ్ లో మొట్టమొదటి సినిమా. కానీ రీమేక్ సినిమా అవ్వడం తో ఈ చిత్రం కూడా ఫ్లాప్ అవుతుందని విశ్లేషకులు అంటున్నారు. ట్రైలర్ కి కూడా ఆడియన్స్ నుండి అంతంత మాత్రం గానే రెస్పాన్స్ వచ్చింది.

# మోక్షజ్ఞ డెబ్యూ మూవీకి డైరెక్టర్ ఛేంజ్



నందమూరి బాలకృష్ణ వారసుడిగా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమవుతున్న నందమూరి మోక్షజ్ఞ తేజ డెబ్యూ సినిమా గురించి ఇటీవల పలు రూమర్లు సంచలనం రేపుతున్నాయి. ప్రారంభంలో, మోక్షజ్ఞ తేజ మొదటి సినిమా కోసం ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహిస్తారని వార్తలు వచ్చాయి.కానీ,తాజాగా వచ్చిన సమాచారం ప్రకారం ఈ ప్రాజెక్టు ఇప్పుడు వాయిదా పడింది. ఆపిన ప్రాజెక్టుతో సంబంధం ఉన్న పుకార్లు నిజం కాదని, దీని పట్ల క్లారిటీ ఇచ్చారు ప్రొడక్షన్ హౌస్. అలాగే, కొన్ని రోజుల క్రితం టాలీవుడ్ లోని కొంతమంది వర్గాల్లో నాగ్ అశ్విన్, "కల్కి" సినిమా ప్యాట్‌లో ఉన్నాడు. అందువల్ల, మోక్షజ్ఞ తేజ మొదటి చిత్రానికి ఆయన దర్శకత్వం వహిస్తారని కూడా ప్రచారం జరిగింది. అయితే, ఈ వార్తలు కూడా అసత్యమని బయటపడ్డాయి.ప్రస్తుతానికి నాగ్ అశ్విన్ "కల్కి 2" సీక్వెల్ పనుల్లో బిజీగా ఉన్నారు. అలాగే,ఈ సినిమాపూర్తయ్యే వరకు, ఇతర హీరోలతో ఆయన సినిమా చేసే అవకాశం లేదు. ప్రశాంత్ వర్మ, "హనుమాన్" సినిమాతో సంచలన విజయాన్ని సాధించిన తర్వాత, మోక్షజ్ఞ తేజతో కూడి సినిమా చేస్తారని మొదట ప్రకటించారు. కానీ, ఈ ప్రాజెక్టు ఆగిపోవడం గురించి వచ్చిన వార్తలు నిజం కావు అని,నిర్మాణ సంస్థ ఎస్ఎల్‌వీ సినిమాస్ స్పష్టం చేసింది. వారు ఈ చిత్రానికి సంబంధించిన అప్‌డేట్స్ త్వరలో విడుదల చేస్తామని చెప్పారు. మోక్షజ్ఞ తేజ యొక్క మొదటి సినిమా గురించి ఆరా తీస్తున్న అభిమానులకు ఊరట కలిగించడానికి, ప్రొడక్షన్ హౌస్ తన అధికారిక ప్రకటన చేసింది. "అసత్యాలు నమ్మకండి," అని వారు జారీ చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.ఇక, మోక్షజ్ఞ తేజ తన పుట్టినరోజున ఈ సినిమా ప్రకటన చేసారు. కాగా, ఈ సినిమా డిసెంబర్ ప్రారంభంలో లాంఛ్ కావాల్సి ఉండగా, అనారోగ్య కారణాలతో సినిమా ఓపెనింగ్ ఈవెంట్‌ను రద్దు చేయాల్సి వచ్చింది.

# ఆ ప్రేమ పేజీ తీయనా.. ప్రేయసి జ్ఞాపకాలను భార్యతో పంచుకుంటున్న వెంకటేశ్



'నాలైఫ్‌లోనున్న ఆ ప్రేమ పేజీ తీయనా.. పేజీలో రాసున్న అందాల ఆ పేరు మీనా.. ట్రైనర్‌గా నేనుంటే ట్రైనీగా వచ్చిందా కూనా.. వస్తునే వెలుగేదో నింపింది ఆ కళ్లలోనా.. చిత్రంగా ఆ రూపం.. చూపుల్లో చిక్కిందే.. మత్తిచ్చే ఓ ధూపం.. ఊపిరిలో జల్లిందే..' ఈ సాహిత్యం వింటే ప్రేమించిన అమ్మాయిని గుర్తు చేసుకుంటూ అబ్బాయి పాడే పాట అని ఎవరైనా ఇట్టే చెప్పేస్తారు. అయితే.. దర్శకుడు అనిల్ రావిపూడి ఇంకాస్త కొత్తగా ఆలోచించాడు. తన ప్రేయసి జ్ఞాపకాలను భార్యతో పంచుకుంటూ భర్త పాడే పాటగా దీన్ని చిత్రీకరించాడు. ఆ భర్త విక్టరీ వెంకటేశ్ కాగా.. భార్య ఐశ్వర్య రాజేష్. ఇక ప్రేయసి ఎవరో తెలిసిందేగా.. మీనాక్షి చౌదరి. రానున్న సంక్రాంతికి సందడి ఏ స్థాయిలో ఉండనుందో ఈ పాటతో చెప్పేశారు 'సంక్రాంతికి వస్తున్నాం' టీమ్. ప్రచారంలో భాగంగా ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు, తొలిపాటగా విడుదలైన 'గోదారి గట్టు'కు అద్భుతమైన స్పందన వస్తున్న నేపథ్యంలో గురువారం విడుదలైన ఈ రెండో పాట.. తొలిపాటను మించేలా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటను భీమ్స్ సిసిరోలియో స్వరపరచి, ప్రణవి ఆచార్యతో కలిసి ఆలపించారు. వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదల కానుంది. ఈ చిత్రానికి కెమెరా: సమీర్‌రెడ్డి.

# రీసెంట్‌గా హరి కథ అంటూ రాజేంద్ర ప్రసాద్ ?



ప్రస్తుతం తెలుగు ఓటీటీల్లో వస్తున్న కంటెంట్ ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటోంది.ఈ క్రమంలోనే, హరి కథ అనే వెబ్ సిరీస్ ప్రత్యేకంగా గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యంగా రాజేంద్ర ప్రసాద్ పోషించిన పాత్ర మరియు ట్రైలర్‌లో కనిపించే ఆధ్యాత్మిక టచ్ ప్రేక్షకులను ఆసక్తిగా మారుస్తోంది. కానీ ఈ సిరీస్ కథ, దాని కథన శైలి ఏమిటి? ఇందులో అసలు మ్యాజిక్ ఏంటో చూద్దాం. ఈ కథ అరకు మరియు దాని చుట్టుపక్కల గ్రామాల్లో జరుగుతుంది. 80, 90 దశకాల నాటి నేపథ్యంలో, ఎస్పై విరాట్ (శ్రీరామ్) తన భార్యను ఓ ప్రమాదంలో కోల్పోతాడు.మరణానికొద్దిరోజులే ఉందని తెలిసిన విరాట్, తన కూతురికి మంచి కుటుంబాన్ని పరిచయం చేయాలనుకుంటాడు.ఈ ప్రయత్నంలోనే అరకు ప్రాంతానికి చేరతాడు,ఎస్పై భరత్ (బిగ్ బాస్ అర్జున్) వద్దకు వెళ్తాడు. అయితే ఆ ప్రాంతంలో వరుస హత్యలు జరుగుతుంటాయి.ఆ హత్యల వెనుక స్వయంగా దేవుడే ఉన్నాడని గ్రామస్తులందరూ నమ్ముతారు.అదే సమయంలో ఎస్పై భరత్ కూడా మరణిస్తాడు.విరాట్ తన స్నేహితుడి మరణం వెనుక అసలు నిజం తెలుసుకునే ప్రయత్నం చేస్తాడు. అక్కడే రంగాచారి (రాజేంద్ర ప్రసాద్) వేషాలు, చామంతి (దివి), జర్నలిస్ట్ లీసా (పూజిత పొన్నాడ), వైదేహీ (శ్రియా కొట్టం) పాత్రలు కథనంలో కీలక మలుపులు తీసుకొస్తాయి.అసలు ఈ హత్యల వెనుక ఏం నిజం ఉంది? వాటి వెనుక దేవుడి పాత్ర నిజమేనా? హరి కథ ఓ సాంఘిక ప్రశ్నలను కలిగించే ప్రయత్నం చేస్తుంది.పుట్టుక మన చేతుల్లో ఉండదనే విషయం, అలాంటి పుట్టుక కారణంగా వివక్ష ఎదుర్కోవడం,అంటరానితనం వంటి అంశాలను ఈ సిరీస్ ప్రస్తావించింది.అప్పుడు అణగారిన వర్గాల పరిస్థితులు, నేటికీ జరుగుతున్న ఆడవారిపై అఘాయిత్యాల వంటి సమస్యలు బలంగా చూపించబడ్డాయి.ఇక కథలో హత్యలు రామాయణం,పురాణాల అవతారాలతో లింక్ చేస్తూ,అర్థవంతమైన సన్నివేశాలను దర్శకుడు పరిచయం చేశాడు. హత్యల వెనుక ఉన్న వ్యక్తులు, ఆ దేవుడి అవతారాల వెనక ఉన్న అసలు ఆలోచన ప్రేక్షకులను అంచనాలకు దూరం చేస్తాయి.

# రామ్ చరణ్‌కి ఇండియాలోనే అతిపెద్ద కటౌట్..

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తేజ్ ప్రధాన పాత్రలో వస్తున్న తాజా చిత్రం గేమ్‌ఛేంజర్ తమిళ దిగ్గజ దర్శకుడు శంకర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. కార్తీక్ సుబ్బరాజు కథను అందిస్తున్నాడు. పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు తెరకెక్కిస్తున్నారు. ఇక ఈ సినిమాను సంక్రాంతి? కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు మేకర్స్. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా.. అరుదైన ఫీట్‌ను అందుకోబోతున్నాడు రామ్ చరణ్. ఈ సినిమా ప్రమోషన్స్ కోసం డిసెంబర్ 29న దేశంలోనే అతిపెద్ద రామ్ చరణ్ కటౌట్‌ను ఆవిష్కరించనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. విజయవాడ బృందావన్ కాలనీలో ఉన్న వజ్రా గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 గంటలకు ఈ కటౌట్‌ను ఆవిష్కరించనున్నట్లు ప్రకటించింది.




# మెగాస్టార్ చిరంజీవితో సినిమా.. మోహన్ బాబు పోస్ట్ వైరల్



మంచు ఫ్యామిలీ వివాదం తర్వాత సీనియర్ నటుడు మంచు మోహన్ బాబు సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడుపుతున్నాడు. ఈ క్రమంలోనే తాను నటించిన ఆల్ టైం క్లాసిక్ సినిమాలను అభిమానులతో పంచుకుంటున్నాడు. ఇప్పటికే మోహన్ బాబు నటించిన శివరంజని సినిమాతో పాటు కలెక్టర్ గారు సినిమాలకు సంబంధించిన విశేషాలను పంచుకున్న మోహన్ బాబు తాజాగా చిరంజీవితో కలిసి నటించిన 'పట్నం వచ్చిన పతివ్రతలు'సినిమాకు సంబంధించిన జ్ఞాపకాలను ఎక్స్ వేదికగా పంచుకున్నాడు. నా సినీ ప్రయాణంలో 1982లో వచ్చిన 'పట్నం వచ్చిన పతివ్రతలు' చిత్రానికి ప్రత్యేక స్థానం ఉంటుంది. ఎంతో ప్రతిభావంతుడైన మౌళి ఈ చిత్రానికి దర్శకత్వం వహించాడు. ఈ సినిమాలో నా పాత్ర ఎంతో సంతృప్తిని కలిగించిందని మోహన్ బాబు అన్నారు. ముఖ్యంగా నా ప్రియమైన స్నేహితుడు చిరంజీవితో స్క్రీన్ పంచుకోవడం.. ఆయనకు అన్నగా నటించడం.. ప్రత్యేక అనుభుతిని మిగిల్చిందని మోహన్ బాబు అన్నారు. నా మూవీ కెరీర్‌లో మర్చిపోలేని చిత్రాల్లో ఒకటిగా ఇది నిలిచి పోతుందని తెలిపారు. 1982లో వచ్చిన ఈ చిత్రం మోహన్ బాబు, చిరంజీవి కెరీర్‌లో మైలురాయిగా నిలిచింది.

EDITOR, PRINTED, PUBLISHED AND OWNER, BINGI SATHAIAH YAADHARTHAVAADHI TELUGU DAILY, PRINTED AT MEGHA PRINTERS, H NO.11-52, INDIRA NAGAR, SIDDIPET-502103, YAADHARTHAVAADHI@GMAIL.COM TELTEL/02022,
RNI/2023/85376 # 11-52, INDIRA NAGAR PRASHANTH NAGAR, SIDDIPET-502103, PUBLISHED FROM: H NO.11-52, INDIRA NAGAR, SIDDIPET-502103, TELANGANA STATE. CELL:8500765666, 9491330519.